



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 204 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 16 ఏప్రియల్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


## టీడీపీ కమిటీలపై 'లోకేష్' ముద్ర!



### పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్

- 'యువగళం' టీమ్‌కు పెద్దపీట.. గ్రౌండ్ లెవెల్ అంతా యువతకే!
- సామాజిక సమీకరణాలతో సీనియర్లకు పొలిట్‌బ్యూరో, జాతీయ పదవులు
- జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, శబరి, కిలారు రాజేష్
- కష్టకాలంలో నిలబడిన వారికి పట్టాభిషేకం.. నాయకత్వ మార్పునకు స్పష్టమైన సంకేతాలు

**అమరావతి, విశ్వం వాయిస్ ప్రతినిధి న్యూస్**

తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న కమిటీల ప్రకటన రానే వచ్చింది. నామినేటెడ్ పదవులు దక్కని నేతలకు అధినాయకత్వం ఇచ్చిన మాట ప్రకారం పార్టీ పదవుల్లో సముచిత స్థానం కల్పించింది. అయితే, ఈ కమిటీల కూర్పులో నారా లోకేష్ మార్క్ స్పష్టంగా కనిపించింది. పార్టీ పగ్గాలను ఆయన క్రమంగా తన చేతుల్లోకి తీసుకుంటున్నారన దానికి ఈ ఎంపికలే ప్రబల నిదర్శనంగా నిలిచాయి. పార్టీ అధిష్టానం 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీలను ప్రకటించగా.. ఇందులో నారా లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమోషన్ పొందడం విశేషం.

**సన్నిహితులకు కీలక బాధ్యతలు**

నారా లోకేష్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి లభించడంతో, ఆయన ఇప్పటివరకు నిర్వహించిన జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను ముగ్గురు అత్యంత సన్నిహితులకు అప్పగించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీ బైరెడ్డి శబరితో పాటు లోకేష్‌కు అత్యంత సన్నిహితుడైన కిలారు రాజేష్‌లను జాతీయ ప్రధాన కార్యదర్శులుగా నియమించారు.

**'యువగళం' టీమ్‌కు పట్టాభిషేకం**

లోకేష్ రాజకీయ ప్రస్థానంలో 'గేమ్ చేంజర్'గా నిలిచిన యువగళం పాదయాత్రలో కీలకంగా పనిచేసిన యువ బృందానికి ఈ కమిటీల్లో మిగతా .. 2లో..

## ఇంటర్‌లో 'ఎంజేపీ' సత్తా

- జూనియర్‌లో 97, సీనియర్ ఇంటర్‌లో 94 శాతంతో బీసీ విద్యార్థుల ఉత్తీర్ణత
- జూనియర్ బైపీసీలో మొదటి, రెండు ర్యాంకులు బీసీ బిడ్డలవే
- జూనియర్ సీఈసీలోనూ ఫస్ట్ ర్యాంకు సొంతం
- ఏడు గురుకులాల్లో సీనియర్ ఇంటర్ లో వంద శాతం ఫలితాలు
- జూనియర్‌లో ఫస్ట్ ప్లేస్ ... సీనియర్లలో సెకండ్ ప్లేస్
- విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి మంత్రి సవిత అభినందనలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటర్ ఫలితాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఫస్ట్ ఇంటర్‌లో 97 శాతం, సెకండ్ ఇంటర్ లో 94 శాతంతో బీసీ బిడ్డలు ఉత్తీర్ణులయ్యారు. జూనియర్ బైపీసీ, ఎంపీసీలో స్టేట్ మొదటి రెండు ర్యాంకులు, సీఈసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు సాధించడం విశేషం. జూనియర్ ఇంటర్‌లో మూడు మిగతా .. 2లో..

## 'AMARAVATI'.. ఏపీ రాజధాని పేరుపై సీఎస్ స్పష్టత

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ రాజధాని అమరావతి పేరుపై స్పష్టత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ఇక నుంచి అన్ని అధికారిక నోట్‌లు AMARAVATI పేరుతోనే ఉండాలని స్పష్టం చేశారు. కొందరు AMARAVATI బదులు AMARAVATHI అని రాయడాన్ని తప్పుబట్టారు. అమరావతిని ఇంగ్లీష్‌లో రాసేటప్పుడు చివరిలో Thiకి బదులుగా Ti ఉండాలని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు, అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

### కృష్ణపట్నం పోర్టు విస్తరణ పనులపై

## మంత్రి బీసీ జనార్దన్ సమీక్ష



**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లాలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా 'అదానీ కృష్ణపట్నం' పోర్టును పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోర్టు విస్తరణ పనులపై చర్చించారు. కంటెయినర్ టెర్మినల్ పునరుద్ధరణ, మౌలిక సదుపాయాలపై మాట్లాడారు. ఎగుమతి, దిగుమతి సామర్థ్యాలు పెంచే విధంగా మిగతా .. 2లో..

### డ్రైవర్ హత్య కేసులో

## ఎమ్మెల్సీ అనంతబాబు పిటిషన్ కొట్టివేత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు కోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో తన భార్య లక్ష్మీదుర్గ ప్రమేయం లేదని, ఆమెను ఈ కేసు నుంచి తప్పించాలని అనంతబాబు పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన రాజమహేంద్రవరంలోని ప్రత్యేక కోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ కేసులో అనంతబాబు ఏ1గా, ఆయన భార్య లక్ష్మీదుర్గ ఏ2గా ఉన్నారు.

## ఆకలి తీరితేనే నిజమైన అభివృద్ధి

- అన్నార్తులకు అండగా అన్న క్యాంటీన్లు
- ఆహార భద్రత కోసమే ప్రజా ప్రభుత్వం కృషి
- గతంలో అన్నదానాన్ని అడ్డుకున్న గొడ్డలి పార్టీ
- ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 62 క్యాంటీన్ల ప్రారంభం
- రాష్ట్రంలో 269కి చేరిన అన్న క్యాంటీన్లు

**ధరణికోట, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదల ఆకలి తీరిస్తేనే అభివృద్ధి సాధించినట్టు విశ్వసిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎంత అభివృద్ధి సాధించినా పేదలకు పట్టెడన్నం లేకపోతే అది వృథా అని ఆయన వ్యాఖ్యానించారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. పలనాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో కార్మికులతో కలిసి సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ధరణికోటలో ఏర్పాటు చేసిన రూరల్ అన్న క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం రూ.5 వెచ్చించి టోకెన్ కొనుగోలు చేసిన ముఖ్యమంత్రి కార్మికులతో కలిసి భోజనం చేశారు. అంతకముందు క్యాంటీన్‌కు వచ్చిన పేదలు, కార్మికులకు ఆయన స్వయంగా భోజనం వడ్డించారు. లబ్దిదారులతో ముచ్చటిస్తూ అన్న క్యాంటీన్‌లోనే సీఎం ఆహారాన్ని తీసుకున్నారు. అన్న క్యాంటీన్లలో అందిస్తున్న భోజనం రుచి, శుభ్రత, నాణ్యతల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "కడుపు నిండితేనే నిజమైన అభివృద్ధి నేను నమ్ముతాను. అందుకే పేదవాడి ఆకలికి తీర్చడానికి ప్రజాప్రభుత్వం అన్న క్యాంటీన్లు తెచ్చింది. పేదవాడికి పట్టెడన్నం పెట్టడమే నా రాజకీయం అని ఎన్టీఆర్ రూ.2 లకే కిలో బియ్యం ఇచ్చి ఆహార భద్రత పథకానికి నాంది పలికారు.



నిత్యాన్నదాతగా డొక్కా సీతమ్మ పేరు అజరామరం. ఆకలి అన్న వాళ్ల కాదనకుండా అన్నం పెట్టడం మన సంస్కృతిలోనే ఉంది. సంక్షేమం అనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతంలోనే ఉంది. నాటి రెండు రూపాయల కిలో బియ్యం నుంచి నేటి అన్నా క్యాంటీన్ల వరకు ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. 2024లో అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశాం. ముందుగా పట్టణ ప్రాంతాల్లో అన్నక్యాంటీన్లు ప్రారంభించాం. ఇవాళ్టి నుంచే గ్రామీణ ప్రాంతాల్లో 62 అన్నక్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే పట్టణాల్లో 204, గ్రామాల్లో 65 కలిపి ఈ సంఖ్య 269కి పెరిగింది. త్వరలో మరో 5 క్యాంటీన్లు సిద్ధం అవుతున్నాయని" సీఎం స్పష్టం చేశారు.

**అక్షయ పాత్రకు అభినందనలు**

"అన్న క్యాంటీన్లకు నిరంతరం ఆహార మిగతా .. 2లో..

### ఆకివీడు రామాలయం కేసులో

## హైకోర్టులో స్వయంగా వాదించిన రఘురామ

- రామాలయంపై ఎటువంటి ప్రతికూల ఉత్తర్వులు ఇవ్వని న్యాయస్థానం
- ప్రభుత్వం, రఘురామ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం
- ప్రభుత్వం నుంచి అండర్‌టేకింగ్ కోరిన హైకోర్ట్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆకివీడు రామాలయం అంశంపై బుధవారం హైకోర్టులో స్వయంగా హాజరై వాదనలు వినిపించటం చర్చనీయాంశమైంది. ఇదే అంశంపై విజయవాడలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయం నిర్మాణం అనుమతులు లేకుండా జరుగుతోందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించిన రఘురామ కృష్ణంరాజు స్వయంగా కోర్టుకు వెళ్లి తన వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా రామాలయం నిర్మాణం భక్తుల విరాళాలతో జరుగుతోందని, అన్ని చట్టబద్ధ అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు కొనసాగిస్తామని రఘురామ కోర్టుకు హామీ ఇచ్చారు. చట్టపరమైన నిబంధనలను పూర్తిగా పాటిస్తామని స్పష్టం చేశారు. ఈ కేసులో కోర్టు రామాలయంపై ఎటువంటి ప్రతికూల ఉత్తర్వులు ఇవ్వలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం తరఫు న్యాయవాదుల వాదనలు, తన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. అలాగే చట్టపరమైన నిబంధనలు పాటిస్తామని ప్రభుత్వం నుంచి అండర్‌టేకింగ్ ఇవ్వాలని కోర్టు కోరగా, అందుకు ప్రభుత్వ న్యాయవాదులు మిగతా .. 2లో..

### డీలిమిటేషన్ పేరుతో

## గెర్రీమాండరింగ్‌కు కుట్ర

### రాహుల్ గాంధీ ఆరోపణ



**విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ బిల్లు 2023లోనే పార్లమెంట్ ఆమోదం పొందిందని.. ఇప్పటికే ఇది రాజ్యాంగంలో భాగమైందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లుతో మహిళా రిజర్వేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఏప్రిల్ 16న పార్లమెంటు ముందుకు రానున్న నేపథ్యంలో ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఓ వీడియో విడుదల చేశారు.

**గెర్రీమాండరింగ్‌కు పాల్పడుతోంది..**

డీలిమిటేషన్‌తో కేంద్ర ప్రభుత్వం గెర్రీమాండరింగ్‌కు (నియోజక వర్గాల సరిహద్దులను మార్చి, తమ పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చేలా చేయడం) పాల్పడే ప్రయత్నం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నియోజకవర్గాలను తమకు అనుకూలంగా పునర్వ్యవస్థీకరించుకునే కుట్ర చేస్తోందన్నారు. గెర్రీమాండరింగ్‌తో మళ్లీ అధికారం పొందేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. కులగణనను మిగతా .. 2లో..

### ధైర్యముంటే నా కారు

## రోజూ చెక్ చేయండి

### మమతా బెనర్జీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తాను ప్రయాణిస్తున్న వాహనాన్ని చెక్ చేసేందుకు కేంద్ర బలగాలు యత్నించాయని దీదీ ఆరోపించారు. కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే తనిఖీ చేయాలంటూ ఆదేశాలు అందాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్ దినాజ్‌పూర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మమత మాట్లాడుతూ "ఈరోజు ఉదయం కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా కేంద్ర బలగాలు నా కారును చెక్ చేయడానికి ప్రయత్నించాయి. ఒకవేళ మీకు ధైర్యం ఉంటే నా కారును రోజూ తనిఖీ చేయండి. కేవలం టీఎంసీ నాయకుల వాహనాల్లోనే ఈ చెకింగ్‌లు జరుగుతున్నాయి" అని ఆరోపించారు. దీదీ మేనల్లుడు, తృణమూల్ నాయకుడు అభిషేక్ బెనర్జీ వాహనాన్ని కూడా తనిఖీ చేసినట్టు సమాచారం. " కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే లక్ష్యంగా చేసుకొంటున్నారు. ఇది కుట్రపూరిత చర్యే" అని టీఎంసీ నేత కునాల్ ఘోష్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, బెంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29న రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి.

### ఈ 9 పనులు చేస్తామని

## మాటివ్వండి

### ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆది చుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. "మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.

పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం

అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.

'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.

మిగతా .. 2లో..

### చమురు ధరలు

## భారీగా తగ్గుతాయ్

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధం ముగిసిన తర్వాత చమురు ధరలు భారీగా తగ్గుతాయని అన్నారు, మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు. నవంబర్ నాటికి చమురు ధరలు పెరుగుతాయని తాను చెప్పినట్లు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారన్నారు. ధరలు పెరుగుతాయని చెప్పలేదన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందన్నారు. నవంబర్‌లో ఎన్నికలు వచ్చే సమయానికి చమురు ధరలు భారీగా పడిపోతాయన్నారు.

**చైనా చాలా హ్యాపీ..**

చైనా హ్యాపీగా ఉందంటూ ట్రంప్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు. త్వరలో హర్మూజ్ జలసంధిని శాశ్వతంగా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# టీడీపీ కమిటీలపై 'లోకేష్' ముద్ర!

అత్యంత ప్రాధాన్యత దక్కింది. పాదయాత్ర విజయవంతంలో అహర్నిశలు శ్రమించిన చింతకాయల విజయ్, పాశం సునీల్ కుమార్‌లకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా కీలక బాధ్యతలు అప్పగించారు. అలాగే పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పించారు. పార్టీ విపక్షంలో ఉన్న కష్టకాలంలో అండగా నిలబడిన వారికి, స్థానిక నేతల వ్యతిరేకతను సైతం పక్కనపెట్టి మరీ పదవులు కట్టబెట్టారు. కొవ్వూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి కేఎస్ జవహర్ కుమారుడు ఆశీష్ లాల్‌కు రాష్ట్ర కార్యదర్శి పదవి దక్కడం దీనికి నిదర్శనం.

**సీనియర్లకు సామాజిక న్యాయం.. జాతీయ స్థాయి గౌరవం**

పదవుల ఎంపికలో సీనియర్లకు సామాజిక వర్గాల వారీగా సముచిత గౌరవం కల్పించారు. యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, పితాని సత్యనారాయణ, వర్ల రామయ్య, నందమూరి బాలకృష్ణ తదితరులకు పొలిట్‌బ్యూరోలో చోటు కల్పించారు. రాష్ట్ర అధికార ప్రతినిధులుగా సమర్థవంతంగా పనిచేసిన సీనియర్లకు జాతీయ అధికార ప్రతినిధులుగా ప్రమోషన్ ఇచ్చారు. పట్టాభి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దీపక్ రెడ్డి, నర్సిరెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. పార్టీ జాతీయ కోశాధికారిగా సీనియర్ నేత కొనకళ్ల నారాయణకు పదవినిచ్చి గౌరవించారు.

**నాయకత్వ మార్పునకు సంకేతాలు..**

మొత్తం మీద చూస్తే పార్టీ కమిటీలన్నీ 'లోకేష్ టీమ్'తో నిండిపోయాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సీనియర్లను జాతీయ, పొలిట్‌బ్యూరో కమిటీల్లో నియమించి గౌరవించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో పెత్తనమంతా యువతకే, ముఖ్యంగా లోకేష్ బృందానికే దక్కింది. ఈ కమిటీల కూర్పు ద్వారా టీడీపీలో నాయకత్వ బదిలీ మొదలైందన్న స్పష్టమైన సంకేతాలను పార్టీ అధిష్టానం కేడర్‌కు పంపింది. కష్టకాలంలో జెండా మోసిన వారికి ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందనే భరోసాను ఈ ఎంపికల ద్వారా క్షేత్రస్థాయిలోకి బలంగా పంపడంలో టీడీపీ సక్సెస్ అయింది.

# ఇంటర్‌లో 'ఎంజేపీ' సత్తా

ఎంజేపీ గురుకులాలు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించగా, సీనియర్ ఇంటర్ లో ఏడు గురుకులాల వంద శాతం మేర ఫలితాలు సాధించాయి. వాటిలో మూడు గురుకులాలు సీనియన్, జూనియర్ ఇంటర్ లో వంద శాతం ఫలితాలు రాబట్టాయి. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే అన్ని రకాల విద్యా సంస్థల్లో ఇంటర్ ఫలితాల్లో జూనియర్ ఇంటర్ లో ఎంజేపీ గురుకుల విద్యార్థులు 97 శాతంతో మొదటి వరుసలో నిలిచారు. సీనియర్ ఇంటర్ లో 94 శాతంతో రెండో స్థానంలో నిలిచి ఔరా అనిపించుకున్నారు. రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే ఎంజేపీ గురుకుల విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం అధికం ఉండడం విశేషం. ఇంటర్మీడియట్ ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం విడుదల చేశారు. జూనియర్ ఇంటర్ లో 77 శాతం, సీనియర్ ఇంటర్ లో 81 మంది శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు నెల రోజులు పాటు కొనసాగి, మార్చి 24వ తేదీతో ముగిశాయి. జూనియర్ ఇంటర్ పరీక్షలకు 5,10,307 మంది, సీనియర్ ఇంటర్ కు 5,05,609 మంది మొత్తం 10,15,916 మంది హాజరయ్యారు.

**జూనియర్ బైపీసీలో 1, 2 స్టేట్ ర్యాంకులు ఎంజేపీవే...**

జూనియర్ ఇంటర్ లో ఎంజేపీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఫస్ట్ ఇంటర్ లో 97 శాతంతో బీసీ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. 18 గురుకుల కళాశాలలకు చెందిన మొదటి సంవత్సరం పరీక్షలకు 1,728 మంది హాజరుకాగా, 1,663 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలతో పాటు మూడు గ్రూపుల్లోనూ స్టేట్ ర్యాంకులు సాధించి ఎంజేపీ విద్యార్థినులు విజయ ఢంకా మోగించారు. బైపీసీలో అరికెలకు చెందిన సీహెచ్.శ్రీలక్ష్మి తేజస్విని 455 మార్కులకు 453 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. సీఈసీ గ్రూప్ లో అరికెలకు చెందిన పి.సురేఖ 500 మార్కులకు 496 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ గా నిలిచింది. ఎంపీసీలో 470 మార్కులకు 467 మార్కులు సాధించిన ధర్మాన అనురాధ(నెల్లిమర్ల) స్టేట్ లో ద్వితీయ స్థానంలో నిలిచింది.

**సీనియర్ ఇంటర్‌లో 94 శాతం**

సీనియర్ ఇంటర్ లోనూ ఎంజేపీ గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. 1,849 మంది విద్యార్థులు ద్వితీయ ఇంటర్ పరీక్షలు రాయగా, వారిలో 1,735 మంది ఉత్తీర్ణత సాధించారు. 94 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే విద్యా సంస్థల్లో ఎంజేపీ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. నెల్లిమర్లకు ఎంజేపీ గురుకులానికి చెందిన జి.ప్రియాంక ఎంపీసీలో 1000 మార్కులకు 992 మార్కులు సాధించింది. బైబీసీలో డోన్ కు చెందిన బి.శైలజ 987 మార్కులు, సీఈసీలో టేకులోడుకు చెందిన ఎం.హిమబిందు 975 మార్కులు, ఎంఈసీలో టేకులోడుకు చెందిన దీప్తి 969 మార్కులు సాధించింది.

**నూటికి నూరు... 3 గురుకులాలు**

మూడు ఎంజేపీ గురుకులాలు జూనియర్, సీనియర్ ఇంటర్ లో నూటికి నూరు ఫలితాలు సాధించాయి. సీనియర్, జూనియర్ ఇంటర్ పరీక్షలకు హాజరైన ఆముదాలవలస, అరికెల, నెరవాడ గురుకులాలకు చెందిన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఇవే కాకుండా గుడిబండ, మోపిదేవి, నందలూరు, సోదాం కు చెందిన గురుకులాల విద్యార్థులు సీనియర్ ఇంటర్ లో వందకు వందశాతం ఫలితాలు రాబట్టారు.

**రాష్ట్ర స్థాయి కంటే ఎంజేపీ సత్తా**

రాష్ట్ర స్థాయి పలితాల కంటే ఎంజేపీ గురుకులాల ఉత్తీర్ణతా శాతం అధికంగా ఉంది. జూనియర్ ఇంటర్ లో రాష్ట్ర స్థాయి ఫలితాలు 77 శాతం రాగా, ఎంజేపీలో 97 శాతం మేర రావడం గమనార్హం. సీనియర్ ఇంటర్ లో రాష్ట్రస్థాయి ఫలితాలు 81 శాతం రాగా, ఎంజేపీ విద్యార్థులు 94 శాతంతో సత్తా చాటారు. ప్రభుత్వ పరిధిలో నడిచే అన్ని విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకులాలు జూనియర్ ఇంటర్ లో ప్రథమ స్థానంలో నిలిచాయి. సీనియర్ ఇంటర్ లో రెండో స్థానం సాధించాయి. జూనియర్ ఇంటర్ లో గతేడాది 92 శాతం రాగా, ఈ ఏడాది ఏకంగా 97 శాతం మేర ఫలితాలు రావడం విశేషం. సీనియర్ ఇంటర్ లో గతేడాది 97 శాతం రాగా, ఈ ఏడాది 94 శాతం ఫలితాలు వచ్చాయి.

**చంద్రబాబు, లోకేశ్ లక్ష్యం నెరవేరింది... : మంత్రి సవిత**

ఇంటర్ ఫలితాల్లో ఎంజేపీ గురుకుల విద్యార్థులు సత్తా చాటడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ఫస్ట్ ఇంటర్ లో 97 శాతం, సెకండ్ ఇంటర్ లో 94 శాతం ఫలితాలు సాధించినందుకు విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి 90 శాతానికి పైగా ఫలితాలు సాధిస్తూ, బీసీ బిడ్డలు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యాన్ని నెరవేర్చారన్నారు. బీసీ బిడ్డలు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. విద్యతోనే సాధ్యమని నమ్మి, ఎంజేపీ, బీసీ హాస్టళ్ల అభివృద్ధికి రెండేళ్లలో పెద్దఎత్తున నిధులు కేటాయించారన్నారు. బీసీ బిడ్డలకు నాణ్యమైన భోజనం అందించాలన్న ఉద్దేశంతో సన్న బియ్యం అందజేస్తున్నారన్నారు. నాణ్యమైన ఆహారం, ఆరోగ్య రక్షణతో కూడిన విద్యను బీసీ బిడ్డలకు అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బీసీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కొనియాడారు. రాబోయే పదో తరగతి ఫలితాల్లోనూ ఇదే మాదిరిగా ఉత్తీర్ణత సాధిస్తామని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు.

కృష్ణపట్నం పోర్టు విస్తరణ పనులపై

# మంత్రి బీసీ జనార్దన్ సమీక్ష

పోర్టు విస్తరణ పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. పోర్టు కార్యకలాపాలు పెరగడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అంతకుముందు ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో 'అన్న క్యాంటీన్' ప్రారంభించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు.

# ఆకలి తీరితేనే నిజమైన అభివృద్ధి

సరఫరా చేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌ను అభినందిస్తున్నాను. 25 ఏళ్లుగా ఈ ఫౌండేషన్ 500 కోట్ల భోజనాలను సరఫరా చేసింది. అన్న క్యాంటీన్లలో రూ.5కే అందిస్తున్న భోజనం పేద వాళ్లు, ఆటోడ్రైవర్లు, ముఠా కార్మికులు, కూలీలకు ఆసరాగా నిలుస్తోంది. పేదవాళ్లకు వచ్చే కొద్దిపాటి డబ్బులతో బయట హోటల్‌లో తినడం ఆర్థికంగా ఎంత భారమో నాకు తెలుసు. అన్న క్యాంటీన్ల ఏర్పాటుతో వారి డబ్బు ఆదా అయ్యి ఇతర అవసరాలకు ఉపయోగపడుతుంది. అన్నక్యాంటీన్లలో సరఫరా చేసే భోజనానికి రుచి, శుభ్రత, నాణ్యతకే ప్రథమ ప్రాధాన్యం. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలతో మూడు పూటలా ఆకలి తీర్చుకునే అవకాశం కల్పించాం. ఒక్కో అన్నా క్యాంటీన్‌లో రోజుకు సగటున 1,013 మంది ఆహారాన్ని తీసుకుంటున్నారు. దీని నిర్వహణ కోసం రూ.26,250 ఖర్చు అవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. దీనికోసం రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతోంది. ఇప్పుడు కొత్తగా పెట్టిన 62 గ్రామీణ అన్న కాంటీన్లలో ఆహార సబ్సిడీకి రోజుకు మరో రూ.18 లక్షలు, ఏడాదికి రూ.58 కోట్లు అవుతుంది. కొత్త క్యాంటీన్ల నిర్మాణానికి రూ.43 కోట్ల వ్యయం అయ్యింది. గడచిన 21 నెలల్లో అన్నక్యాంటీన్లలో 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఇప్పటి వరకూ అన్నక్యాంటీన్ సబ్సిడీ కోసం రూ.243 కోట్ల మేర ఖర్చు చేశాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**పేదల పొట్టగొట్టిన గత పాలకులు**

"గత పాలకులు ఆకలి తీర్చే అన్నపూర్ణ వంటి అన్న క్యాంటీన్లపైనా దాడులు చేశారు. పేదల కడుపు నింపుతున్న పథకాన్ని నిలిపివేశారు. వ్యక్తులు, సంస్థలు స్వచ్ఛందంగా అన్నదానం చేస్తుంటే దానిలో మట్టి పోసి, దాడులు చేసి అడ్డుకున్నారు. వైసీపీకి కావాల్సింది విధ్వంసం, హింస, కూల్చడం, నరకడం, నాశనం చేయడమే. ఏ రాజకీయపార్టీ అయినా ప్రజలకు ఏం చేస్తామో చెబుతుంది. కానీ వైసీపీ మాత్రం రప్పా రప్పా చేస్తాం, 2029లో విధ్వంసం చూపిస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడుతోంది. అందుకే ఆ పార్టీ పేరు గొడ్డలి పార్టీగా మార్చుకోవాలి. ఒక రాజకీయ పార్టీగా ఉండే అర్హత ఆ పార్టీకి లేదు అని "ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఇంఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్, కలెక్టర్ కృతికా శుక్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు రామాలయం కేసులో

# హైకోర్టులో స్వయంగా వాదించిన రఘురామ

అంగీకరించారని, దీంతో కేసు ముగించారన్నారు. అలాగే ఆలయం, చర్చి, మసీదు అన్న తేడా లేకుండా అన్ని మతపరమైన కట్టడాలకు చట్టం సమానంగా వర్తించాలన్నారు. ఏ నిర్మాణానికైనా జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఈ విషయంపై ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల ఇతర అవసరాల పేరుతో అనుమతులు తీసుకుని మతపరమైన కట్టడాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. కల్వరి టెంపుల్ పేరిట తాడేపల్లిగూడెం, నంబూరు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. అయితే అధికారులు ఇప్పటికే ఈ అక్రమ కట్టడాలకు నోటీసులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టాన్ని అందరికీ సమానంగా వర్తింపచేసేలా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. ఆకివీడు రామాలయం అంశం గురించి మీడియా ద్వారా తెలిసిందని, అక్కడికి వెళ్లే సమయంలో తనపై అడ్డంకులు సృష్టించారన్నారు. ఈ నేపథ్యంలోనే కోర్టులో స్వయంగా వాదనలు వినిపించాల్సి వచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాలను అందరూ పాటించకపోతే ప్రజల్లో తప్పు సందేశం వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ మతానికి చెందినదైనా అక్రమ నిర్మాణాలను పాలకులు సహించరాదన్నారు. రామాలయానికి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉన్నప్పటికీ, నూతనంగా అన్ని అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణం కొనసాగుతుందని రఘురామ కృష్ణంరాజు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ వ్యతిరేక మీడియా తాను చేస్తున్న ఈ వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగిస్తాయని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నిజానికి రాజ్యాంగ విలువలను కాపాడేందుకు తాను చేస్తున్న కృషి వల్ల ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరు ను, అడ్డుకునేందుకే సదరు మీడియా ఈ తరహా కుట్ర చేస్తోందని ఆరోపించారు.

డీలిమిటేషన్ పేరుతో

# గెర్రీమాండరింగ్‌కు కుట్ర

విస్మరించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేస్తున్నారని.. దక్షిణ, ఈశాన్య.. రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదన్నారు. అంతకుముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో పోరాడుతామని అన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని ఖర్గే డిమాండ్ చేశారు.

ఈ 9 పనులు చేస్తామని

# మాటివ్వండి

జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

# భారీగా తగ్గుతాయ్

తెరవనున్నట్లు పేర్కొన్నారు. దీని వల్ల చైనాతో పాటు ప్రపంచమంతా లాభపడుతుందని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు ఆయుధాలు ఇవ్వకుండా ఉండేందుకు బీజింగ్ అంగీకరించిందన్నారు. ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్, తాము కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఆయన్ను కలుస్తానన్నారు. అదే సమయంలో యుద్ధం చేయడంలో అమెరికాను మించిన దేశం మరొకటి లేదనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు.

పాత లెక్కలు.. కొత్త జిల్లాలు..

# ఏపీ, టీఎస్‌లో విభజన సవాళ్లు


దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం సమాయత్తమైంది. గురువారం నుంచి ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల సంఖ్య పెంపు, పునర్విభజనపై రాజ్యాంగ సవరణకు రంగం సిద్ధం చేస్తోంది. అయితే 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలనే కేంద్ర నిర్ణయం అనేక ప్రశ్నలకు తెరలేపుతోందని అంటున్నారు. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలలో పునర్విభజన సవాల్ గా మారే అవకాశం ఉందని అంటున్నారు.

**టార్గెట్ 2029**

2011 జనాభా లెక్కలు ఆధారంగా పునర్విభజన చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం జనాభా గణన కార్యక్రమం మొదలైనప్పటికీ, పాత లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రం భావిస్తోంది. దీనికి పలు ముఖ్య కారణాలను చూపుతోంది. 2029 ఎన్నికల నాటికి పునర్విభజన ప్రక్రియ పూర్తి చేసి కొత్త నియోజకవర్గాలతోనే ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. తాజాగా నిర్వహిస్తున్న జనగణన ప్రకారం పునర్విభజన చేయాలంటే 2029 ఎన్నికల నాటికి ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యం కాదనే కారణంగా 2011 జనగణన లెక్కల ఆధారం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

**రెండు రాష్ట్రాల్లో ఒకటే పరిస్థితి**

అయితే కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దేశంలో మరెక్కడా సమస్య రాకపోయినా, ఏపీ, తెలంగాణలో మాత్రం పలు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. 2011 జనగణన తర్వాత రాష్ట్ర విభజన జరగడంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లాల స్వరూపంలోనూ మార్పులు వచ్చాయని చెబుతున్నారు. 2011లో జనగణన చేపట్టిన సమయంలో రాష్ట్రం ఉమ్మడిగా ఉండేది. అప్పట్లో 25 జిల్లాలు మాత్రమే ఉండేవి. ఈ జిల్లాల ఆధారంగానే జనగణన పూర్తి చేశారు. ఇప్పుడు పాత లెక్కల ఆధారంగానే నియోజకవర్గాలు పునర్విభజన చేస్తామంటున్నారు. అయితే అప్పట్లో ఒకే రాష్ట్రంగా ఉన్న ఏపీ రెండుగా విడిపోవడంతోపాటు రెండు రాష్ట్రాల్లోనూ కొత్త జిల్లాలు పుట్టుకురావడం విభజన ప్రక్రియకు అవాంతరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు.



**పాత లెక్కలతో సాధ్యమా?**

ఈ పరిస్థితుల్లో పాత లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన సాధ్యమా? అన్న ప్రశ్న ఉదయిస్తోందని అంటున్నారు. 2011 తర్వాత ఏపీ రెండుగా విడిపోవడం విభజిత ఆంధ్రప్రదేశ్ లో జిల్లాలు 13 నుంచి 28కి పెరిగాయి. అదేవిధంగా తెలంగాణలో పది జిల్లాలు 33 అయ్యాయి. అంతేకాకుండా విభజన సమయంలో తెలంగాణ పరిధిలో ఉన్న కొన్ని మండలాలను ఏపీలోకి తీసుకువచ్చారు. ఆయా మండలాలను ఏపీలోని రంప చోడవరం నియోజకవర్గంలో చేర్చారు. అప్పటివరకు ఈ మండలాలు తెలంగాణలోని ఖమ్మం పార్లమెంటు పరిధిలో ఉండగా, విభజన అనంతరం అరకు పార్లమెంటు పరిధిలో చేర్చారు.

**తెలంగాణలో కొత్త మండలాలు కూడా..**

ఇప్పుడు పాత లెక్కల ప్రకారమే విభజన అంటే అప్పట్లో ఉన్న ఉమ్మడి జిల్లాల ఆధారంగా నియోజకవర్గాలను విభజించాల్సివుంటుందని అంటున్నారు. అయితే తెలంగాణలో జిల్లాలతోపాటు కొత్త మండలాలను ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా నుంచి పోలవరం నిర్వాసిత మండలాలు ఏపీలోకి మారడం కూడా సమస్యగా మారవచ్చని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ సమస్యను కేంద్రం గుర్తించిందా? లేదా? అన్నదే ఇప్పుడు ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ఈ విషయమై ముందుగా క్లారిటీ లేకపోతే, విభజన ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. దీనివల్ల కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం 2029 ఎన్నికల నాటికి పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యమయ్యే పరిస్థితి ఉండదని విశ్లేషిస్తున్నారు.

# కొత్తకు టీడీపీ అందలం... రేపటి నాయక దళం




తెలుగుదేశం పార్టీ జాతీయ రాష్ట్ర కార్యవర్గాలను ఒకేసారి ప్రకటించింది. ఏకంగా 185 మందితో రాష్ట్ర కమిటీని రిలీజ్ చేసింది. జాతీయ కమిటీలో అధ్యక్షుడు చంద్రబాబు వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కాకుండా జాతీయ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, జాతీయ అధికార ప్రతినిధులు ఇలా 32 దాకా జాబితా ఉంది. మొత్తం చూస్తే 220 దాకా పదవులు టీడీపీ ప్రకటించినట్లు అయింది. ఇక 26 మందితో పొలిట్ బ్యూరో మెంబర్స్ ని తీసుకున్నారు. ఇందులో అత్యధికులు యువత మహిళలు ఉన్నారు. నాయకత్వ లక్షణాలు చూసిన మీదటనే వీరికి పార్టీ పదవుల్లో చాన్స్ ఇచ్చారని తెలుస్తోంది. దాంతో రానున్న రోజులలో ఈ పదవులు అందుకున్న వారు మరింతగా రాణిస్తే వారికే పార్టీ ఎమ్మెల్యే ఎంపీ టికెట్లు కూడా ఇచ్చి ప్రోత్సహించే అవకాశాలు అధికంగా ఉన్నాయని అంటున్నారు.

**మండల స్థాయి నేతకు :** రాష్ట్ర కమిటీలో చూస్తే ఒక మండల స్థాయి మహిళా నేతకు నేరుగా చాన్స్ దక్కింది. దానికి కారణం ఆమె పనితీరు అని అంటున్నారు. అలాగే అనేక మంది నాయకులకు రాష్ట్ర జాతీయ కార్యవర్గాలలో చోటు ఇచ్చారు. ఇదంతా వారి పని తీరు ప్రతిభ ఆధారంగానే అని అంటున్నారు. ఒక విధంగా చెప్పాలీ అంటే టీడీపీ దగ్గరుండి మరీ పార్టీ నేతల పనితీరుని గమనిస్తోంది. అధ్యయనం చేస్తోంది. ఎవరు బాగా పనిచేస్తున్నారు అని గుర్తించి మరీ వారికి మార్కులు వేయడమే కాదు అందలాలు ఎక్కిస్తోంది.

**కొత్త నెత్తురుతోనే :** టీడీపీలో అనుభవం కలిగిన వారిని ఉంచుతూనే ఎక్కువగా యువతకు పెద్ద పీట వేశారు. అంటే దీని అర్థం పార్టీకి కొత్త నెత్తురు ఎక్కించాలని అని అంటున్నారు. 26 మందితో రూపొందించిన పొలిట్ బ్యూరోలో ఎపుడూ కనిపించే పేర్లు ఈసారి లేవు. ఆ ప్లేస్ లో ఎంతో మంది కొత్త వారు వచ్చి చేరారు నారా లోకేష్ పదే పదే చెబుతున్నట్లుగా ఎవరైనా పొలిట్ బ్యూరోలోకి రావచ్చు. వారి నాయకత్వ పటిమ ఆధారంగానే అవకాశాలు ఉంటాయి. ఆ విధంగా చెప్పిన మాట ప్రకారమే అధినాయకత్వం అవకాశాలను అందించింది అనుకోవాలి ఉంది. ఒక విధంగా టీడీపీ అంటే ఎంతో మంది సీనియర్ల పేర్లు వినిపిస్తాయి. ఈసారి కొత్త వారిని ముందుకు తీసుకుని రావడం ద్వారా రేపటి రోజున వారిని కూడా మరింతగా ప్రోత్సహించి పార్టీని మరో నాలుగు దశాబ్దాల పాటు బలోపేతం చేసుకునే దిశగా తీసుకున్న కీలక నిర్ణయంగా అంతా చూస్తున్నారు.

**మూడవ వంతు వారికే :** ఇక దేశంలో మహిళా రిజర్వేషన్లు కనుక అమలులోకి వస్తే మూడవ వంతు సీట్లు వారి పరం అవుతాయి. అలా చూస్తే ఏపీలో 88 సీట్లకు మహిళా అభ్యర్థులు ఉంటారు దాంతో టీడీపీ ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పెద్ద ఎత్తున మహిళలను ప్రోత్సహిస్తోంది. అందులో కూడా ఎక్కువ మంది యువతకే చాన్స్ ఇస్తోంది. అలాగే ఈసారి ఎక్కువగా సీట్లు పెరుగుతాయి కాబట్టి కొత్త వారికి కూడా చాన్స్ ఇవ్వాలని చూస్తోంది. దీని వల్ల పార్టీ సరికొత్త గ్లామర్ తో జనంలోకి వెళ్తుందని పార్టీ పని తీరులో కూడా గణనీయమైన మార్పు ఉంటుందని భావిస్తున్నారు. అలాగే కొత్త తరం ఆలోచనతో టీడీపీ సైకిల్ మరింతగా పరుగులు పెడుతుందని కూడా అధినాయకత్వం న్యూ విజన్ తో ఈ నిర్ణయాలు తీసుకుంది. ఏది ఏమైనా టీడీపీ జాతీయ రాష్ట్ర కార్యవర్గాల ఎంపిక చూసిన తరువాత ఇది భేష్ అయిన ఎంపిక అని అంతా అంటున్నారు. టీడీపీకి మరింత మంచి భవిష్యత్తుని అందించడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని కూడా అంచనా వేస్తున్నారు. ఇక పదవులు అందుకున్న వారు కష్టపడితే వారికి బ్రైట్ ఫ్యూచర్ ఉంటుంది అని కూడా చెబుతున్నారు.

# ఎడిటర్ వాయిస్

## రెండు సీట్లుగా పిఠాపురం.. కర్చీఫ్‌తో వర్మ రెడీ

పిఠాపురం వర్మగా గత రెండేళ్ళుగా సోషల్ మీడియాలో విపరీతమైన ప్రాచుర్యం పొందిన ఎస్వీఎస్ఎన్ వర్మ మూడేళ్ళకు ముందే కర్చీఫ్ వేసేసారు. 2029లో కచ్చితంగా పోటీకి రెడీ అని సిగ్నల్స్ ని పంపేసారు. తనకు టికెట్ రాకుండా ఈసారి ఏ శక్తీ అడ్డుకోలేదని ధీమాగా ఉన్నారు. ఇంతకీ వర్మలో అంతటి నమ్మకం కలగడానికి కారణం ఏమిటి అంటే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన. పిఠాపురం కూడా రెండుగా మారుతుందని అందులో ఒకటి తనకు దక్కుతుందని భావించి ముందే స్కెచ్ గీసే పనిలో వర్మ ఉన్నారు అని అంటున్నారు.

ఇదీ పిఠాపురం పరిస్థితి : పిఠాపురం నియోజకవర్గం మూడు లక్షలకు పైగా జనాభాతో ఉంది. ఇక్కడ మూడు మండలాలు రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. దాంతో కచ్చితంగా ఈ సీటు విభజనలో రెండు అవుతుందని అంటున్నారు. అయితే అలా రెండు అయ్యే సీటులో వర్మకు చాన్స్ ఉంటుందా అన్నదే చర్చ. టీడీపీ అధినాయకత్వం ఆయనకు టికెట్ ఇవ్వాలనుకున్నా రెండవ సీటు మహిళలకు కేటాయిస్తే వారికి రిజర్వేషన్ అయితే అప్పుడు సంగతేంటి అన్న చర్చ కూడా వస్తోంది. అయితే దానికి కూడా వర్మ విరుగుడు మంత్రం కనిపెట్టేశారు అని అంటున్నారు.

ఫ్యామిలీ ప్యాక్‌తోనే : వర్మ ఎంత తెలివిగా అడుగులు వేస్తున్నారు అంటే తాజాగా జరిగిన పార్టీ కొత్త ఆఫీసు ఓపెనింగ్ కి ఆయన తన సతీమణితో కుమారుడితో కలిసి హాజరయ్యారు. ఈ విధంగా క్యాడర్ కి వారిని ముందే పరిచయం చేసేసారు. పిఠాపురం రెండవ సీటు మహిళలకు రిజర్వ్ అయితే తన భార్య చేత పోటీ చేయించడానికి వర్మ ప్రిపేర్ అయిపోయారని అంటున్నారు. అలా కాకుండా యువతకు అవకాశం అని టీడీపీలో అంటే తన కుమారుడు గిరీష్ ని సిద్ధం చేస్తున్నారుట, ఇలా ఎట్టి పరిస్థితుల్లోనూ సీటు తమ కుటుంబం చేజారిపోకుండా చూసుకుంటూ చాలా తెలివిగానే ఆయన అడుగులు వేస్తున్నారు అని అంటున్నారు.

జనసేన సైతం : అయితే మొత్తం పిఠాపురం నియోజకవర్గంలో బలోపేతం అయిన జనసేన రెండవ సీటు వస్తే పోటీ పడకుండా ఉంటుందా అన్నదే అసలైన ట్విస్ట్. ఎందుకంటే 2024 లో కేవలం 21 సీట్లకే పరిమితం అయిన ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో రెట్టింపు సీట్లకు పోటీ చేస్తుందని అంటున్నారు అలా తమకు బలమున్న సీట్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. తాము ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న సీట్లలోనే రెండు అయితే ఆ సీట్లనే తీసుకుంటే తమకు గెలుపు సులువు అవుతుందని జనసేన నేతలు అంటున్నారు. అది సహజమైన డిమాండ్ అని కూడా అంటున్నారు క్యాడర్ లీడర్ ఉన్న చోట వదిలేసుకుని కొత్త సీట్లో రిస్క్ చేయరు కదా అని అంటున్నారు ఆ విధంగా జనసేన చూపు కూడా రెండవ సీటు మీద ఉంది అని అంటున్నారు. దాంతో వర్మ వర్సెస్ జనసేన కంటిన్యూ అవుతుందా ఎక్కువ సీట్లు వచ్చినా వర్మకు పోటీకి రూట్ క్లియర్ అవుతుందా లేదా అన్నదే చర్చగా ఉంది మరి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## భరత్ యాదవే పులివెందులలో గంజాయి కింగ్‌పిన్

**వైకాపా హయాంలో తుపాకీ లైసెన్స్ సైతం జారీ - పది మంది ముఠాను అరెస్టు చేసిన పోలీసులు**



**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** పులివెందుల పోలీసులు కీలకమైన గంజాయి ముఠాను అరెస్టు చేశారు. విచ్చలవిడిగా సరఫరా చేస్తున్న భరత్ యాదవ్ సహా పది మందిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఇది జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగిన తర్వాత సీబీఐ విచారణ సమయంలో.. వైకాపా నేతల సూచనల మేరకు భరత్ యాదవ్ నిందితుల వెంట దిల్లీకి వెళ్లాడు. తర్వాత సునీత దంపతులపై ఆరోపణలు చేసి సీబీఐకి లేఖలు రాశాడు. వివేకా హత్య కేసులో ఏ2గా ఉన్న సునీల్ యాదవ్‌కు భరత్‌యాదవ్ సమీప బంధువు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకుల సిఫార్సుతో తుపాకీ లైసెన్స్ పొంది.. సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు దిగేవాడు. అప్పు తిరిగి ఇవ్వలేదన్న కారణంగా 2023లో పులివెందులలో ఓ వ్యక్తిని పట్టపగలు కాల్చి చంపినట్లు అభియోగాలున్నాయి. ఇతనిపై మరికొన్ని కేసులు కూడా ఉన్నాయి. వైకాపా హయాంలో పులివెందులకు చెందిన కీలక నేతలిద్దరి మద్దతుతో పేట్రేగిపోయారు. సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నప్పుడు తోటి ఖైదీ ఇర్ఫాన్‌తో భరత్‌కు పరిచయమైంది. జైలు నుంచి బయటికి వచ్చాక గంజాయి సరఫరా చేస్తూ యువత, విద్యార్థులను చెడు వ్యసనాల వైపు మళ్లించి గ్యాంగ్ లీడర్ అవతారమెత్తాడు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చే బాధ్యతను ఇర్ఫాన్‌కు అప్పగించాడు. అనంతరం పది మంది ముఠా ద్వారా ప్యాకెట్లు తయారు చేసి విక్రయించేవాడు. గత రెండేళ్లలో ఈ గ్యాంగ్ విస్తృతంగా గంజాయి సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. నాలుగు రోజుల క్రితం గంజాయి బ్యాచ్ ఘర్షణకు దిగింది. వారిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించారు. భరత్ యాదవ్ కూడా హాజరయ్యాడు. తర్వాత నిశితంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు భరత్ యాదవ్ ముఠాను పట్టుకున్నారు. వారి నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో 8 మందిని అరెస్ట్ చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పులివెందుల ప్రాంతంలో రౌడీల కట్టడికి గట్టి చర్యలు తీసుకున్నామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మీడియాకు చెప్పారు.

## గుండెపోటుతో బ్యాంకులో కుప్పకూలిన వ్యక్తి

**విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లోని హబ్సిగూడలో విషాదం చోటుచేసుకుంది. నగదు డిపాజిట్ కోసం బ్యాంకుకు వచ్చిన ఓ విశ్రాంత ఉద్యోగి గుండె పోటుతో మృతి చెందారు. నాచారంకి చెందిన లక్ష్మీనారాయణ.. పంజాబ్ నేషనల్ బ్యాంకులో డిపాజిట్ ఫారం నింపుతూ ఒక్కసారిగా కుర్చీలోంచి కిందపడిపోయారు. స్థానికులు, బ్యాంకు సిబ్బంది గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీకెమెరాల్లో నమోదయ్యాయి.

## నలుగురు ఇంటర్ విద్యార్థుల బలవన్మరణం

**సిద్దిపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** పరీక్షల్లో ఫెయిలైతే మళ్లీ రాయడానికి అవకాశం ఉంటుంది.. అసలు ఉత్తీర్ణత సాధించకపోయినా బతకడానికి ఏదో ఒక దారి కనపడుతుంది. ఈ విషయం అర్థం చేసుకోలేని నలుగురు విద్యార్థులు.. తీవ్రమైన బాధ, క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. కన్నవాళ్లకు గుండెకోత మిగిల్చారు. రాష్ట్రంలో సోమవారం వేర్వేరుచోట్ల జరిగిన ఈ సంఘటనలతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట పట్టణ శివారులోని రంగనాయకపురానికి చెందిన విద్యార్థిని(17) చిన్నకోడూరు మండలం అల్లీపూర్ కస్తూర్బా కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఫెయిలవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. సోమవారం మధ్యాహ్నం సెల్ఫీ వీడియో తీసుకుంటూ 'అమ్మానాన్న టాటా.. బైబై' అంటూ ఇంట్లో ఉరి వేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై అంజయ్య తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫెయిలైన నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలం గొల్లమాడలో విద్యార్థి(17) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం కారాముంగికి చెందిన విద్యార్థిని(17) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఫస్టియర్ చదువుతుంది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మనూరు మండలం ఎన్‌జీహుక్రాన గ్రామానికి చెందిన విద్యార్థి(17) సిర్గాపూర్ మండలం నల్లావాగులోని బాలుర గురుకులంలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఫెయిలవడంతో వ్యవసాయ పొలం దగ్గర చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు.

## శాంతికి రెండు రోజుల కస్టడీ

**15, 16 తేదీల్లో విచారించేందుకు ఏసీబీ కోర్టు అనుమతి**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతిని... కోర్టు రెండు రోజుల కస్టడీకి ఇచ్చింది. నిందితురాలిని ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని గత వారం అవినీతి నిరోధక శాఖ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. ఈ నెల 15, 16 తేదీల్లో కస్టడీకి తీసుకుని విచారించేందుకు కోర్టు అనుమతించింది. తనకు రెండున్నరేళ్ల పసిబిడ్డ ఉన్నందున ప్రత్యేక ములాఖత్‌కు అనుమతి ఇవ్వాలని శాంతి వేసిన పిటిషన్‌పై ఉత్తర్వుల నిమిత్తం 16కి కోర్టు వాయిదా వేసింది.

**పోలీసు వాహనం ఢీకొని**

## ఏఎస్సై దుర్మరణం

**కక్షపూరితంగా హత్య చేశారని కుటుంబసభ్యుల ఆరోపణ**



**మనూరు, నారాయణఖేడ్, విశ్వం వాయిస్ న్యూస్ :** అతివేగంగా వచ్చిన పోలీసు వాహనం ఢీకొన డంతో ఏఎస్సై దుర్మరణం చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా మనూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చోటుచేసుకుంది. మనూరు ఎస్సై కోటేశ్వరరావు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ ఖేడ్ మండలం డీఎన్‌టీ తండాకు చెందిన గోవింద్‌నాయక్(58) మనూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్ నుంచి కాలినడకన బయలుదేరారు. వాహనం తీసుకురమ్మని డ్రైవర్‌కు చెప్పి పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయం ముందు నిలబడి ఉన్నారు. డ్రైవర్ రామారావు పెట్రోలింగ్ వాహనాన్ని అతివేగంగా తీసుకొచ్చి ఏఎస్సైను ఢీకొట్టాడు. తీవ్రగాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గంమధ్యలో మృతి చెందారు. వాహన డ్రైవర్ పరారు కావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కక్షపూరితంగానే హత్య చేశారని ఏఎస్సై కుటుంబీకులు ఆరోపించారు. జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు సుప్రిత్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోటేశ్వర్‌రావు వివరించారు. గోవింద్‌నాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నారాయణఖేడ్ మండలం డీఎన్‌టీ తండాలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. బాధిత కుటుంబానికి ఎస్పీ ఆర్థిక సహాయం అందజేశారు. ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, పోలీసులు ఉన్నారు.

## బేగంపేటలో కారు దగ్ధం



**విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ బేగంపేటలో ప్రయాణిస్తున్న కారులో మంటలు చెలరేగాయి. మంగళవారం రాత్రి వరంగల్ నుంచి మణికొండ వైపు వెళుతున్న ఒక కారు బేగంపేట లోని లైఫ్ స్టైల్ భవనం సమీపానికి చేరుకోగానే, ఇంజిన్ నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. ఘటన జరిగిన సమయంలో కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. వారు వెంటనే అప్రమత్తమై కారును పక్కను నిలిపివేసి కిందకు దిగారు. దీంతో వారికి ప్రాణాపాయం తప్పింది. ప్రధాన రహదారిపై కారు తగలబడటంతో ఆ ప్రాంతంలో భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేశారు. కారు ముందుభాగం పూర్తిగా దగ్ధమైంది.

## కౌలు పొలం ఎండిపోవడంతో.. యువరైతు బలవన్మరణం



**చేగుంట, విశ్వం వాయిస్ న్యూస్ :** కౌలుకు తీసుకున్న పొలం నీళ్లు లేక ఎండిపోవడంతో సాగు నిమిత్తం చేసిన అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లిలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యరెడ్డి తెలిపిన ప్రకారం... చెట్లతిమ్మాయిపల్లికి చెందిన పొన్న సాయిబాబా(32) రెండెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశారు. సాగు నిమిత్తం రూ.3 లక్షల వరకు అప్పు చేశారు. రెండు బోర్ల నుంచి నీటిని అందించారు. పంట చేతికొస్తున్న తరుణంలో ఒక బోరు పూర్తిగా వట్టిపోయింది. మరో బోరు సైతం తక్కువ నీటినే అందిస్తోంది. దీంతో పంట ఎండిపోవడం ప్రారంభమైంది. సాగు చేసిన పంటంతా కళ్లముందే ఎండిపోతుండటంతో సాయిబాబా మనస్తాపానికి గురయ్యారు. చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక మంగళవారం పొలంలోనే చెట్టుకు ఉరేసుకున్నారు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

# మనకన్నా ముందున్న దేశాలెన్నో..

# సక్సెస్ వాయిస్

పార్లమెంట్ స్థానాల్లో 33శాతం మహిళలకు కేటాయించాలి అంటూ మనం చేసుకున్న చట్టాలు ఇంకా కార్యరూపం దాల్చలేదు కానీ... కొన్ని దేశాల పార్లమెంట్లలో 50శాతం కన్నా ఎక్కువ స్థానాల్ని మహిళలు భర్తీ చేశారని మీకు తెలుసా? అవేంటంటే... ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ (ఐపీయూ) 1889లో స్థాపితమైన అంతర్జాతీయ సంస్థ. ప్రజాస్వామ్యం, శాంతి, సుస్థిరాభివృద్ధి, లింగసమానత్వం వంటి అంశాల దృష్ట్యా పార్లమెంట్లకి ర్యాంకులు ఇస్తూ... అభివృద్ధి దిశగా వాటిని ప్రోత్సహిస్తూ ఉంటుంది. ఐక్యరాజ్య సమితితో కలిసి పనిచేస్తోందీ సంస్థ. దీని ప్రకారం...

**మహిళలే ఎక్కువ...**

ప్రపంచంలోనే చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం ఎక్కువగా ఉన్న దేశాల్లో రువాండాది మొదటి స్థానం. ఇక్కడి రాజకీయ సభల్లో 63.8శాతం మంది మహిళలే. అయితే ఇది ఒక్కసారిగా వచ్చిన విజయం కాదు. ఏళ్ల కృషికి ఫలితం. 1994లో జరిగిన జాతుల పోరాటంలో చాలామంది పురుషులు మరణించారు. శాంతిభద్రతల స్థాపనకి మహిళలు నిర్ణయాత్మక స్థానాల్లో ఉండాలన్న అభిప్రాయం వెలువడింది. దాంతో నాయకత్వ స్థానాల్లోకి మహిళలు రావడం మొదలైంది. 2003లో దీన్ని చట్టబద్ధం చేసి, కనీసం 30శాతం మంది మహిళలు ఉండాలన్నారు. అది కాస్తా అంచెలంచెలుగా పెరుగుతూ 60శాతాన్ని దాటేసింది.

**ఏ చట్టమూ లేకుండానే...**

రువాండా తర్వాత స్థానంలో క్యూబా ఉంది. ఇక్కడి పార్లమెంట్‌లో 57.2శాతం స్థానాల్ని మహిళలు భర్తీ చేశారు. 1959లో క్యూబా విప్లవం తర్వాత పురుషాధిక్య సమాజం నుంచి మహిళలకు విముక్తి కలిగింది. ఈ విప్లవంలో పాల్గొన్న విల్మా ఎస్పిన్ నాయకత్వంలో 'ఫెడరేషన్ ఆఫ్ క్యూబా విమెన్' అనే సంస్థను ఏర్పాటుచేశారు. దీనిద్వారా ఆసక్తి ఉన్న మహిళల్ని రాజకీయాలవైపు ప్రోత్సహించడం మొదలుపెట్టారు. అర్హత ఉన్నవాళ్లని నాయకత్వ స్థానాల్లో



కూర్చోబెట్టారు. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. అయితే ఇక్కడ ఫలానా స్థానాల వరకే మహిళలు పరిమితం అన్న నిబంధనలేవీ లేవు.

**నియంతృత్వానికి వ్యతిరేకంగా...**

లాటిన్ అమెరికా ఉద్యమాల్లో మహిళలు ఎక్కువగా పాల్గొన్న వాటిల్లో శాండినిస్టా ఒకటి. దాదాపు 30శాతం మంది మహిళలు ఆయుధాలు ధరించి శాంతి స్థాపనకు పోరాడారు. ఫలితంగా యుద్ధం ముగిసిన అనంతరం పేద, మధ్యతరగతి, విద్యావంతుల జాబితాల నుంచి మహిళలకి చట్టసభల్లో స్థానం కల్పించడం మొదలుపెట్టారు. దాని ఫలితమే ప్రపంచ పార్లమెంట్ల ర్యాంకులో మూడో స్థానంలో ఉంది నికరాగ్వా. 56శాతం మంది మహిళా అభ్యర్థులే.

**బలమైన చట్టాలతో...**

ఏ ఉద్యమాలూ జరగకపోయినా... మిగతా దేశాల ప్రగతిని చూసి తమ దేశ మహిళలకు చట్టసభల్లో లింగసమానత్వం కల్పించింది కోస్టారికా. ఐపీయూలో 52.6శాతంతో నాలుగో స్థానంలో ఉందీ దేశం. ఎలక్టోరల్ కోడ్ (లా నెంబర్ 8765) ప్రకారం రాజకీయ సభల్లో మహిళలూ పురుషులూ 50-50 నిష్పత్తిలో ఉండాల్సిందే. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విమెన్' వంటి సంస్థలు బలంగా పనిచేస్తూ ఈ నిష్పత్తిని కాపాడుకొంటూ వస్తున్నాయి.

**తొమ్మిది శాతం మాత్రమే...**


ఐయూపీలో 50.8శాతంతో ఐదో స్థానాన్ని దక్కించుకున్న దేశం బొలీవియా. అయితే 1997లో 9శాతం మంది మహిళలే చట్టసభల్లో ఉండేవారట. అప్పటి ప్రధాని మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ అనేక మార్పులు తీసుకువచ్చారు. వాటిల్లో ముఖ్యమైనవి 50శాతం రిజర్వేషన్లు, జిప్పర్ సిస్టమ్ (సంబంధిత పదవుల్లో ఒకసారి మహిళ, ఒకసారి పురుషులు ఉండాలనే నియమం) తదితర వాటితో మహిళల్ని రాజకీయాల దిశగా నడిపించారు. ఇవన్నీ ఆర్థికంగా, భౌగోళికంగా భారత్ కంటే చిన్నవే. కానీ రాజకీయాభివృద్ధిలో, లింగసమానత్వంలో మాత్రం ముందంజలో ఉన్నాయి. దీనివల్ల అక్కడి ప్రజలు పొందుతున్న లాభాలు చాలానే. ఇక్కడి సభా సమయాల్లో 70శాతానికి పైగా విద్య, వైద్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల మీదే చర్చలు జరుగుతాయి. పైగా, అధికార ప్రతిపక్షాలు ఉన్నా... అంతా అభివృద్ధి విషయంలో ఒకే మాట మీద ఉంటారు. కాబట్టే బిల్లులూ తొందరగా పాస్ అవుతుంటాయి. ర్యాంకింగ్‌లో వెనకబడిన దేశాలతో పోల్చితే ఇక్కడి అక్షరాస్యత శాతమూ ఎక్కువే. మాతాశిశు సంక్షేమానికే పెద్దపీట వేస్తారు. మన దగ్గరా ఇది అమలైతే ఈ తరహా అభివృద్ధిని మనమూ ఆశించవచ్చు.

## కొత్తపేటలో ప్రభుత్వ కార్యాలయాలు, హాస్పటల్స్ నడుమ అన్న క్యాంటీన్ ప్రారంభం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదవారికి పట్టెడన్నం పెట్టడమే కూటమి ప్రభుత్వ సంకల్పం అన్నం పెట్టే లక్షణం మాది, విధ్వంసం సృష్టించే లక్షణం వైసీపీది కొత్తపేటలో అన్నాక్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండారు రావులపాలెం కూడా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం పేదవారికి పట్టెడన్నం పెట్టడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కొత్తపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి,తదితరులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అన్నా క్యాంటీన్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజమే దేవాలయం, పేద ప్రజలే దేవుళ్ళు అని ప్రజల కనీస అవసరాలయిన తిండి, బట్ట, నీడ అందించడమే ధ్యేయంగా ఆనాడు స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు పేద ప్రజల అభ్యున్నతి కోసమే తెలుగుదేశం పార్టీ మూల సిద్ధాంతంగా పాటుపడుతుందన్నారు. ఆ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్న ఎన్టీఆర్ పేరు మీద అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. అనేక మంది పేద ప్రజలకు రూ.5లకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజనం అందిస్తూ అన్న క్యాంటీన్లలో వందలాదిమందికి భోజనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2019లో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్నా క్యాంటీన్లను విధ్వంసం చేశారన్నారు. మరలా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 207 అన్నా క్యాంటీన్లు పేద ప్రజల కడుపు నింపుతున్నాయన్నారు. అందరికీ పట్టెడన్నం దొరకాలి,ఆకలితో ఎవ్వరూ ఉండకూడదన్న తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం భూమికగా ఈ అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయన్నారు. మరలా బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు 62 అన్నా క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. నేడు కొత్తపేటలో అన్న క్యాంటీన్ ప్రారంభించామన్నారు.400 మందికి రూ. 5కే మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుం దన్నారు. 8 కోట్ల 80 లక్షలమందికి ఇప్పటివరకు అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం పెట్టడం జరిగిందన్నారు. ప్రతిరోజు రెండు లక్షల పదివేల మందికి అన్నా క్యాంటీన్ల ద్వారా మూడు పూటలా భోజనం అందుతుందన్నారు. కొత్తపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభించడం శుభ పరిణామమని, త్వరలోనే రావులపాలెంలో సైతం అన్నా క్యాంటీన్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. తప్పకుండా మంజూరు చేస్తామని వారు హామీ ఇచ్చారని, త్వరలోనే రావులపాలెంలో అన్నా క్యాంటీన్ ప్రారంభించడానికి నిర్ణయం తీసుకుంటామన్నారు. నేడు ప్రజలు కూడా ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏ ప్రభుత్వం పేద ప్రజలకు పట్టెడన్నం పెడుతుంది? ఏ నాయకులు విధ్వంసం సృష్టిస్తామని అంటున్నారో ఆలోచించుకోవాలన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లను జగన్ రద్దు చేశాడన్నారు. అన్నం పెట్టే పార్టీ కావాలా? విధ్వంసం సృష్టించే పార్టీ కావాలా? అనేది ప్రజలు ఆలోచించుకునే గత ఎన్నికల్లో కూటమిని అధికారంలోకి తెచ్చారన్నారు. కొత్తపేటలో ప్రభుత్వ కార్యాలయాలు, హాస్పటల్స్ నడుమ అన్న క్యాంటీన్ ప్రారంభించడం చాలా బాగుందన్నారు. రావులపాలెం లో కూడా అన్నా క్యాంటీన్ పెట్టాలని ముఖ్యమంత్రి ని, మునిసిపల్ శాఖ మంత్రి నారాయణను కోరడం జరిగిందని. త్వరలోనే రావులపాలెం లో కూడా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.మొదటి విడతగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, అందించడం జరుగుతుందన్నారు. అన్నా క్యాంటీన్ లో పేదలకు ఎవరైనా భోజనం స్పాన్సర్ చేద్దామనుకున్నా కూడా పుట్టినరోజు కానీ, పెళ్లి రోజు కానీ ఇతర కార్యక్రమాలకు కూడా వారు కూడా స్పాన్సర్ చేయవచ్చన్నారు. బుధవారం నాడు అన్నా క్యాంటీన్ లో పేదవారికి మధ్యాహ్న భోజనాన్ని యువ నాయకులు బండారు శ్రీ కృష్ణ సందీప్ తన పుట్టినరోజు సందర్భంగా రూ 13600 స్పాన్సర్ చేశారు. ఆయనను ఎమ్మెల్యే బండారు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు స్వయంగా అందరికీ భోజనాలు వడ్డించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి భోజనం ఎలావుంది అని అడిగి తెలుసుకున్నారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని చేసి అన్న క్యాంటీన్ ను ఇక్కడ ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, కొత్తపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు, వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ ఉప అధ్యక్షుడు ముత్యాల బాబ్జి,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గనిశెట్టి వీరేష్, బండారు కృష్ణ సందీప్, కార్పొరేషన్ డైరెక్టర్లు చిలువూరు సతీష్ రాజు,మిద్దె ఆదినారాయణ బుసి జయలక్ష్మి భాస్కరరావు,ధర్మాల రామకృష్ణ, రెడ్డి శ్రీను ,కొప్పిశెట్టి ప్రసాద్,రెడ్డి తాతాజీ,పల్లి యేసు, చావల జగన్నాథం,కముజు గంగాధర్,కడలి భీమేశ్వరావు, విల్లా మారుతి, కొత్తపేట మండలం తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు మరియు యన్ డి ఏ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి అభినందనలు : రెడ్డి శ్రీనివాస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమర్థ నాయకత్వంతో ప్రజలకు అనేక మౌలిక సదుపాయాలు అందుతున్నాయని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రజల అవసరాలను గుర్తించి కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఎమ్మెల్యే దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. నియోజకవర్గంలో సుమారు 90 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు మరియు డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టారని తెలిపారు. అదేవిధంగా కొత్తపేటలో 50 లక్షల రూపాయలతో అన్న క్యాంటీన్ ఏర్పాటు, 4 కోట్ల రూపాయలతో కైలాస భూముల అభివృద్ధి, పలు గ్రామాల్లో కాలువల అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. అలాగే 57 గ్రామాల్లో సుమారు 75 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు మరియు డ్రైనేజీల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా 10 కోట్ల రూపాయలతో ఇరిగేషన్ అభివృద్ధి పనులు, 30 కోట్ల రూపాయలతో దేవాలయాల అభివృద్ధి, అలాగే 2.50 కోట్ల రూపాయలతో 90 మందికి పైగా రైతులకు గోకులం షెడ్లు నిర్మాణం చేపట్టారని తెలిపారు. అదేవిధంగా 14 కోట్ల రూపాయలతో విద్యుత్ పనులు కూడా నిర్వహించడం జరిగిందన్నారు.కోనసీమ తిరుమల వాడపల్లి వద్ద రూ.12 కోట్లతో గదుల నిర్మాణం, 4 డార్మిటరీలు, అలాగే వాడపల్లికి రూ.7 కోట్లతో ఏటిగట్టు రహదారి నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల ఆధునీకరణకు రూ.74.20 కోట్ల పనులు, వసంతవాడ గ్రామంలో వాటర్ గ్రిడ్ పనులకు శంకుస్థాపన వంటి కార్యక్రమాలు చేపట్టి ఎమ్మెల్యే బండారు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని వెంటనే పరిష్కారం చూపే ప్రజానాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. మరెన్నో అభివృద్ధి ప్రతిపాదనలతో రావులపాలెంలో బీసీ కళ్యాణ మండపం నిర్మాణం, ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలను ఒకేచోట ఏర్పాటు చేయడం, ప్రభుత్వ రహదారుల అభివృద్ధి, 35 కోట్ల రూపాయలతో అమలాపురం, బొబ్బర్లంక రోడ్డు నిర్మాణం, టూరిజం అభివృద్ధి కోసం పలు ప్రాజెక్టులు, అలాగే దేవాలయాల అభివృద్ధికి కోట్ల రూపాయల పనులు చేపట్టేందుకు ఆయన చూపుతున్న ముందుచూపు ప్రశంసనీయం అని తెలిపారు ఎమ్మెల్యే నాయకత్వంలో కొత్తపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని, ప్రజల సంక్షేమం కోసం ఆయన నిరంతరం శ్రమిస్తూ నిజమైన ప్రజా ప్రతినిధిగా నిలుస్తున్నారని రెడ్డి శ్రీనివాస్ కొనియాడారు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి దృఢ సంకల్పంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి కూడా ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.రాష్ట్రం మొత్తం అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు మేలు చేసేలా ఉన్నాయని రెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## రైతులకు ప్రభుత్వ రాజముద్ర పట్టాదారులుకు పాసుపుస్తకాలు పంపిణీ



**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** లక్కవరం ఎంజి గార్డెన్స్ మినీ ఫంక్షన్ హాల్‌లో మలికిపురం మండలానికి చెందిన రీ-సర్వే పూర్తయిన విశ్వేశ్వరాయపురం మరియు ఇరుసుమండ గ్రామాల రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజోలు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూ రీ-సర్వే ప్రక్రియ ద్వారా భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారించబడతాయని, రైతులకు భవిష్యత్తులో ఎటువంటి భూ వివాదాలు లేకుండా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్డీయే కూటమి నాయకులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యంకు ఘన సన్మానం

### శుభాకాంక్షలు తెలిపిన మండల యువ శెట్టిబలిజ సంఘం సభ్యులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన సీనియర్ నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యంని కొత్తపేట మండల యువ శెట్టిబలిజ సంఘ సభ్యులు బుధవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యంకి శాలువాతో ఘనంగా సత్కరించి, పూలమాల వేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో కీలక పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన రాజకీయ ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకమని సభ్యులు కొనియాడారు. సామాజిక వర్గాలకు అండగా నిలిచిన నేత ఈ సందర్భంగా యువ శెట్టిబలిజ సంఘం సభ్యులు మాట్లాడుతూ, “రెడ్డి సుబ్రహ్మణ్యం నాలుగు దశాబ్దాలు పైగా పార్టీకి, ప్రజలకు, ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా బడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడారు.జిల్లా ఉపాధ్యక్షుడి స్థాయి నుంచి నేడు జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎదగడం మా అందరికీ గర్వకారణం. ఆయనకు ఈ పదవి దక్కడం కొత్తపేట ప్రాంతానికే వన్నె తెచ్చింది” అని అన్నారు.నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో రెడ్డి సుబ్రహ్మణ్యం పార్టీని మరింత బలోపేతం చేస్తారని, బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తారని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల యువ శెట్టిబలిజ సంఘం గౌరవ అధ్యక్షులు యనమదల శ్రీనివాస్, కొప్పిశెట్టి వాసు, అధ్యక్షులు శీలం కొండబాబు, ఉపాధ్యక్షులు జోగి మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జోగి గని,కార్యవర్గ సభ్యులు కడలి భీమా,కడలి పార్థ సారధి, మామిడిశెట్టి బాలాజీ,కముజు గోపి ,గణపతి యువ నాయకులు పాల్గొన్నారు.

### రైతు సమస్యల పరిష్కారానికి

## వారధిగా కార్యకర్తలు నిలవాలి

### పసలపూడిలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం విజయవంతం

### గ్రామీణ స్థాయిలో నూతనంగా కార్యకర్తల చేరిక



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం పసలపూడిలోని శ్రీ సత్యసాయి ట్రస్ట్‌లో ఘనంగా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలంలో గల పసలపూడి గ్రామంలో బుధవారం జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తొలుత రాష్ట్ర ఉపాధ్యక్షులు సింహాద్రి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కిసాన్ మోర్చా బలోపేతానికి గ్రామ స్థాయిలో కమిటీల నిర్మాణం కీలకమని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు వారధిగా ఉండాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి రైతు దరికి చేర్చాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఆడబాల సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కోనసీమ జిల్లాలో పార్టీ బలోపేతానికి కిసాన్ మోర్చా కార్యకర్తలు కృషి చేయడం అభినందనీయమన్నారు. గ్రామ స్థాయిలో కొత్త సభ్యులు చేరడం పార్టీకి శక్తినిస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా, మోదీ ప్రభుత్వ పథకాల పట్ల ఆకర్షితులైన పసలపూడి స్కూల్ చైర్మన్ కొవ్వూరి వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా బిజెపి పార్టీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షులు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటోను ఏర్పాటు చేశారు. ముగింపులో అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి మాట్లాడుతూ, సమావేశానికి హాజరైన కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామ కమిటీల నిర్మాణం పూర్తయ్యే వరకు కృషి కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల, గ్రామ కమిటీల నిర్మాణ పురోగతిపై నివేదికలు సమర్పించారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు తమనంపూడి రామకృష్ణారెడ్డి, అనకాపల్లి ఇన్చార్జ్ కర్రీ చిట్టిబాబు, రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సింహాద్రి అప్పన్నకి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాత్రేని కోన మండలం కాత్రేనికోన శివారు కొత్తపాలెం గ్రామానికి చెందిన పెదపాటి సింహాద్రి అప్పన్న కటింగ్ షాప్‌కి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాస్తు బైక్ యాక్సిడెంట్ అయి ఒక కాలు రెండు చోట్ల విరిగిపోవడం వలన ఆపరేషన్ చేశారు సింహాద్రి అప్పన్న కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు మూడు నెలల వరకు బెడ్ రెస్ట్ అని డాక్టర్లు చెప్పారు ఈయన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా మందుల ఖర్చులు నిమిత్తం సంస్థ నుంచి 10000 రూపాయలు కే.పావని 1000. రూపాయలు. కే.హారిక 500 రూపాయలు. మొత్తం 11500. రూపాయలు అక్షయ సేవా సంస్థ సభ్యుల చేతుల మీదుగా సింహాద్రి అప్పన్న తండ్రికి ఇవ్వడం జరిగింది దీనికి సహకరించిన సంస్థ సభ్యులందరికీ ధన్యవాదములు తెలియజేశారు

### ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో

## 465/470 వాకాడ కార్తీక్ కొత్తపేట



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట మండలం బిళ్ళకుర్రు గ్రామ శివారు వాకాడ వారి పాలెం గ్రామానికి చెందిన వాకాడ కార్తీక్ శ్రీ సూర్య ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో 470 మార్కులకు 465 మార్కులు సాధించింది. బుధవారం ఫలితాలలో కార్తీక్ తన ప్రతిభను చాటుకుంది. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన తను 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్థానిక కాంతి భారతి కాన్వెంట్ లో విద్యను అభ్యసించి ఇంటర్మీడియట్ విజయవాడ శ్రీ చైతన్య మయూరి భవనం కళాశాలలో చదువుతూ ఈ సందర్భంగా తమ పూర్వపు విద్యా సంస్థలైన కాంతి భారతి యాజమాన్యం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ ఇంటర్ తో పాటు మెయిన్స్లో ర్యాంకు సాధించి ఉన్నత చదువులు చదవాలని కోరుకుంటున్నాను అన్నారు.

## అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అసోసియేషన్ కీలక సమావేశం

### 25 ఏళ్ల పూర్తి సందర్భంగా రజతోత్సవాలకు సిద్ధమవుతున్న ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



అమలాపురం ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మడికి శ్రీరాములు అధ్యక్షతన ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో అసోసియేషన్ భవిష్యత్ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణ, అలాగే రాబోయే వేడుకలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మడికి శ్రీరాములు మాట్లాడుతూ, డా. బాబు జగజ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఈ ఏడాది రజతోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ఇరవై ఐదు సంవత్సరాలుగా అసోసియేషన్ నిర్వహించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు అసోసియేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ఉపయోగకరంగా నిలిచామని, ఇకపై మరింత విస్తృతంగా సేవలను అందించాలనే లక్ష్యంతో “మడికి శ్రీరాములు హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్”ను స్థాపించినట్లు తెలిపారు. ఈ ఫౌండేషన్ ద్వారా సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు సహాయం చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించుతూ, విద్యార్థులు, విద్యార్థినులకు పుస్తకాలు, పాఠశాల బ్యాగులు, స్టేషనరీ సామగ్రి ఉచితంగా అందజేస్తామని తెలిపారు. అలాగే విద్యలో వెనుకబడిన వారికి ఉచిత ట్యూషన్ సదుపాయం కల్పించడం, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.ఈ సమావేశంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, మడికి సత్యనారాయణ, తెన్నేటి రాజబాబు, నవుండ్రు లక్ష్మణరావు, కోరుకూరి కృపావరం, సీలి సాంసన్, నవుండ్రు వాడపల్లి, నేదునూరి వెంకటరెడ్డి, సవరపు ప్రసాద్, నేదునూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం విజయవంతంగా ముగిసింది.

## ఎన్డీఏ ప్రభుత్వంలో బడుగుల ఆరోగ్యానికి పెద్దపీట : వెంకటలక్ష్మి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో వెంకటలక్ష్మి చేతుల మీదుగా మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.బూరుగుపూడి మోర్తా రాజుకు 30వేలు, బుచ్చింపేట నర్రావుల నరసింహం 25వేలు,బిట్ర మంగతాయారు 30వేలు,దోసకాయలపల్లి గళ్ళ భవాని 33వేలు,గాదరాడ మామిడి అమ్మాజీ 23 వేలు,వల్లేపల్లి నాగ వెంకట సతీష్ కుమార్ 43వేలు, పింకీ ఎలిజబెత్ 28వేలు,నరసాపురం మారిశెట్టి సత్యవతి 31,637 రూపాయలు,గుత్తుల కార్తీక్ వీరేంద్ర 16వేలు,గుత్తుల దుర్గారావు 54,660 రూపాయలు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శాసనసభ్యులు బత్తుల బల రామకృష్ణ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర, యర్రంశెట్టి పోలారావు, ముక్క రాంబాబు, ప్రగడ జోగారావు, ప్రగడ దేవి వరప్రసాద్, పీతా శ్రీనుబాబు, పెదపాటి భీమరాజు, కట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ పచ్చిమాల వసంత్ కుమార్ విగ్రహావిష్కరణ




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ పచ్చిమాల వసంత్ కుమార్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు దడాల సుబ్బారావు, వసంత్ కుమార్ కుటుంబ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వసంత్ కుమార్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన జీవితాంతం సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేశారని గుర్తుచేశారు. అంబేద్కర్ వాదిగా పచ్చిమల బాబ్జి చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. తండ్రి ఆశయాలను తన జీవితంలో ఆచరిస్తూ వసంత్ కుమార్ ముందుకు తీసుకువెళ్లిన విధానం యువతకు ఆదర్శమని తెలిపారు. దురదృష్టవశాత్తు వసంత్ కుమార్‌ను కోల్పోవడం సమాజానికి తీరని లోటుగా అభివర్ణించారు. ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. బాబ్జి, వసంత్ కుమార్ ఆశయ సాధన కోసం కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం నివాళులు అర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.

## రాఘవ్ చడ్డా సెక్యూరిటీని తొలగించిన పంజాబ్..

**విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభ ఎంపీ రాఘవ్ చడ్డాకి జెడ్ ప్లస్ సెక్యూరిటీని పంజాబ్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయితే కేంద్రం ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరీలో భద్రత కల్పించనున్నట్లు సమాచారం. పార్లమెంట్‌లో పంజాబ్‌కు సంబంధించిన కీలక సమస్యలను లేవనెత్తడంలో విఫలమయ్యారని సొంత పార్టీ ఆప్ నుంచే రాఘవ్ చడ్డా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే కేంద్రం భద్రత కల్పించనున్నట్లు ఇంకా ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా, రాజ్యసభలో ఆప్ ఉపనేత హోదా నుంచి రాఘవ్ చడ్డాను ఆ పార్టీ తొలగించడం మాటల యుద్ధానికి దారితీసిన సంగతి తెలిసిందే. తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ చడ్డా వ్యాఖ్యానించారు. దీనిపై ఆప్ స్పందించింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటులో గళమెత్తడానికి ఆయన భయపడుతున్నారని పేర్కొంది.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
గురువారం, 16 ఏప్రియల్ 2026
www.viswamvoice.com





గాయపడిన వ్యక్తికి మంత్రి సుభాష్

# మానవత్వపు చేయూత

రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక సామాన్య వ్యక్తికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటారు. వివరాల్లోకి వెళ్తే, రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం, బట్లపాలిక గ్రామపంచాయతీ పరిధిలోని తాళ్లపూడి గ్రామానికి చెందిన కాలా వెంకట్రావు సైకిల్ తొక్కుతూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని కూటమి పార్టీ నాయకుడు కాటే సుబ్రహ్మణ్యం మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లగా, సుభాష్ వెంటనే స్పందించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి చేరుకున్న మంత్రి, అక్కడ చికిత్స పొందుతున్న వెంకట్రావును పరామర్శించి అతని ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి ధైర్యం చెప్పడమే కాకుండా, మెరుగైన వైద్యం అందేలా చూడాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అనంతరం బాధితుడి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, తక్షణ సహాయం కింద రూ.10,000 విలువైన చెక్కును అందజేశారు. ఆపద సమయంలో మంత్రి స్వయంగా వచ్చి పరామర్శించి ఆర్థిక సాయం అందించడం పట్ల బాధితుడి కుటుంబ సభ్యులు మరియు కూటమి పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తపేటలో ఘనంగా రాజ్యాంగ నిర్మాత

# అంబేద్కర్ జయంతి వేడుకలు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : భారత రాజ్యాంగ శిల్పి, మహనీయ సామాజిక సంస్కర్త, అణగారిన, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహామనిషి డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాల్ వద్ద కొత్తపేట మండల శెట్టిబలిజ సంఘం (పెద్దలు), యువ శెట్టిబలిజ సంఘం (యువత) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి దేశానికి సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ అనే విలువలను అందించిన మహనీయుడు డా. అంబేద్కర్ అని కొనియాడారు.సమాజంలో ఉన్న కుల వివక్ష, అంటరానితనం, అన్యాయాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహా నాయకుడు అంబేద్కర్ అని తెలిపారు. విద్య ద్వారా మాత్రమే సామాజిక మార్పు సాధ్యమని విశ్వసించిన ఆయన "చదువు, చైతన్యవంతం అవ్వు, సంఘటితం అవ్వు" అనే సందేశంతో బలహీన వర్గాలకు దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. దళితులు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన చూపిన మార్గం నేటికీ దేశానికి ప్రేరణగా నిలుస్తోందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు కముజు వెంకటేశ్వరరావు,సెక్రెటరీ గుబ్బల సత్తిపండు,యువ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు శీలం కొండబాబు, యువ శెట్టిబలిజ సంఘ గౌరవ అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, సెక్రెటరీ రాయుడు కార్తీక్,గౌరవ సలహాదారులు ముషిని వెంకట రమణ, కొత్తపేట మండల బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడు కడలి పార్థసారథి, కొత్తపేట మండల టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి కడలి బీమా, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, దంగేటి సాయి,కముజు వర ప్రసాద్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ జోగి గని రాజు, కొప్పిశెట్టి శ్రీరామ్, కుడుపూడి దావీదు రాజు, దునబోయిన ప్రదీప్,రాయుడు బాబీ,వాసంశెట్టి కృష్ణ మోహన్, గెద్దడా బ్రహ్మేంద్ర, బొక్కా బాలు ప్రసాద్, కొప్పిశెట్టి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపే ప్రజా ప్రభుత్వం

# ఎన్డీఏ కూటమి ప్రభుత్వం : గొల్లపల్లి అమూల్య



రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ మానస పుత్రిక, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల రెండో విడత ప్రారంభోత్సవ కార్యక్రమం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఈరోజు ఉదయం ధరణికోట గ్రామంలో రాష్ట్రవ్యాప్తంగా 62 అన్న క్యాంటీన్ లు ప్రారంభోత్సవం చేశారు. దీనిలో భాగంగా మన రాజోలు నియోజకవర్గం రాజోలు గ్రామం శ్రీ షిరిడీ సాయిబాబా వారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో స్థానిక శాసనసభ్యులు దేవ వరప్రసాద్‌తో కలసి పాల్గొన్న రాజోలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య శాసనసభ్యులు దేవ వరప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమూల్య మాట్లాడుతూ పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లను గత జగన్ వైసిపి ప్రభుత్వం మూసివేసి పేదల కడుపు కొడితే, ఈరోజు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తూ ఐదు (5) రూపాయలకే అన్నార్తుల కడుపు నింపుతున్న ప్రజా ప్రభుత్వమని, కూటమి ప్రభుత్వాన్ని చంద్రబాబునాయుడుని, పవన్ కళ్యాణ్‌ని, మంత్రి లోకేష్‌ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గెడ్డం సింహ, గోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ శ్రీమతి బందెల పద్మ, రాజోలు ఎంపీపీ శ్రీమతి కడలి శ్రీదుర్గ, మండల పార్టీ అధ్యక్షులు అడబాల సాయిబాబా, తాడి సత్యనారాయణ, అనుచూరి సునీత రామ పురుషోత్తం, చెల్లుబోయిన నాగబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గోనిపాటి రాజు, మట్టపర్తి లక్ష్మి, సర్పంచ్ శ్రీమతి చెల్లుబోయిన హెలిన, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శ్రీమతి ముత్యాల దుర్గాదేవి శ్రీనివాస్, చింతా లక్ష్మి, కొత్తపల్లి విజయలక్ష్మి, కోళ్ళ వెంకన్న, కట్టా సూరిబాబు, టిడిపి గ్రామశాఖ అధ్యక్షులు పామర్తి రమణ, బోళ్ళ రాజేష్, కడలి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# సమాజసేవలో మలబార్ ట్రస్ట్ ముందంజ

**157 మంది విద్యార్థినిలకు 12.52 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ**

**సమాజ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల పాత్ర ముఖ్యం : రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్**




రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రముఖ మలబార్ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సామజిక సేవలు ఆదర్శప్రాయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. మహిళా విద్యను ప్రోత్సహిస్తూ స్కాలర్షిప్లు అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. స్థానిక ఎన్‌విఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 157 మంది విద్యార్థినిలకు మొత్తం రూ.12 లక్షల 52 వేల ఉపకార వేతనాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినిల భవిష్యత్తు, అభివృద్ధికి ఈ సహాయం ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజ అభివృద్ధికి మహిళా విద్య కీలకమని మంత్రి అన్నారు. సిఎస్ఆర్ నిధులను వెచ్చించి విద్యకు వినియోగించడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలు 'పే బ్యాక్ టు సొసైటీ' నినాదంతో సామాజిక బాధ్యతను గుర్తించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. విద్యాదానం గొప్పదని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 16 ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న 157 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. కాకినాడ మలబార్ గోల్డ్ షోరూం మేనేజర్ ఉండమట్ల సాయి శ్రీకాంత్ మాట్లాడుతూ తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 493 మంది విద్యార్థులకు మొత్తం రూ.39 లక్షల 18 వేల ఉపకార వేతనాలు అందించినట్లు తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి మరింతగా స్కాలర్షిప్లు అందిస్తున్నామని, గత ఏడాది 114 కోట్లు స్కాలర్షిప్లు ఇవ్వగా, 2026-27 సంవత్సరానికి రూ.200 కోట్ల స్కాలర్షిప్లు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. అలాగే సాధారణంగా 2% ఇవ్వాల్సిన సిఎస్ఆర్ నిధుల స్థానంలో 5% వరకు ఉపకార వేతనాల రూపంలో వెచ్చిస్తున్నామని వివరించారు. ఈ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ మలబార్ షోరూమ్ హెడ్ అఖిల్, షోరూం మేనేజర్ ఉండమట్ల సాయి శ్రీకాంత్, మార్కెటింగ్ ఇన్చార్జ్ పేపకాయల శ్రీరామ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, కాజులూరు మండల అధ్యక్షులు చవ్వా కుల నారాయణమూర్తి, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ నాగ శ్రీనివాస్, కాంచనమాల, ధన కృష్ణ, బి.చంద్రశేఖర రావు, ఏబీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొని మలబార్ చారిటబుల్ ట్రస్ట్ సేవలను ప్రసాదించారు.

# డిజిటల్ జనాభా గణన 2027కు కోనసీమ సిద్ధం

## జిల్లా కలెక్టర్ కీలక ఆదేశాలు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి
భారతదేశంలో 17వ జనాభా గణన (2027) ఒక చారిత్రాత్మక ఘట్టమని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో జరగనున్న 17వ విడత డిజిటల్ జనాభా గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సాంకేతిక సహాయకులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా గణన ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేస్తూ క్షేత్రస్థాయి వరకు దిశానిర్దేశాలు ఇచ్చారు. జనాభా గణన 2027 సన్నద్ధతలో భాగంగా కీలక అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ విప్లవం ద్వారా స్వయం గణన సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని, పౌరులు తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్ల నియామకం, శిక్షణ, పర్యవేక్షణ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. డిజిటల్ డేటా నమోదులో తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలాచూడాలన్నారు. జనాభా గణన దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, నిర్దేశిత గడువులోగా వంద శాతం డేటా సేకరణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్వయం గణన వల్ల సమయం ఆదా అవుతుందని, గోప్యత పరిరక్షించబడుతుందని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో మొబైల్ యాప్ వినియోగంపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని, ఇంటర్నెట్ సౌకర్యం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాంకేతిక సహాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి గృహాన్ని కవర్ చేస్తూ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. డిజిటల్ విధానంలో సమాచార సేకరణ జరుగుతున్నందున టాబ్లెట్లు, సాఫ్ట్‌వేర్ వినియోగంలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జనాభా గణనలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సహకారం పొందాలని తెలిపారు. సమాచార భద్రత, గోప్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. దేశంలో తొలి డిజిటల్ జనాభా గణన 2021లో జరగాల్సి ఉండగా, కోవిడ్ కారణంగా ఆలస్యమై ఇప్పుడు అత్యాధునిక సాంకేతికతతో 2026-27లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి కాగితం వినియోగాన్ని తగ్గించి మొబైల్ యాప్‌ల ద్వారా డేటా సేకరణ జరుగుతుందని చెప్పారు. ప్రజలు తమ మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ అయ్యి వివరాలు నమోదు చేసుకోవచ్చని, నమోదు అనంతరం 16 అంకెల ఎస్ ఈ- ఐడి లభిస్తుందని తెలిపారు. ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడీ చూపిస్తే సరిపోతుందని చెప్పారు. జనాభా గణన రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశగా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 వరకు గృహ గణన నిర్వహిస్తారు. ఇందులో ఇంటి నిర్మాణం, సౌకర్యాలు, ఆస్తుల వివరాలు సేకరిస్తారు. రెండవ దశగా ఫిబ్రవరి 2027లో జనాభా గణన చేపడతారు. ఇందులో వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తారు. ఈ 17వ జనాభా గణనలో కుల గణన కూడా కీలక అంశంగా ఉంటుందని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా పూర్తిస్థాయిలో కులాల వారీగా డేటా సేకరించనున్నారు. ఇది సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్ల విధానాలకు ఆధారంగా నిలుస్తుందని చెప్పారు. గృహ గణనలో ఇంటి యాజమాన్యం, తాగునీటి సౌకర్యం, వంట గ్యాస్, డిజిటల్ పరికరాలు, ప్రయాణ సాధనాలపై వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ డిజిటల్ విధానం ద్వారా సమాచారం గోప్యంగా ఉండటంతో పాటు విశ్లేషణ వేగంగా పూర్తవుతుందని, ఫలితాలు త్వరగా వెల్లడయ్యే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో జనాభా గణనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్ధగణాంక అధికారి మురళీకృష్ణ, డీఆర్‌డీఏ, డ్వామా పీడీ రాంబాబు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులతో ఆసుపత్రి కార్పొరేట్ స్థాయికి చేరువవుతుంది

**కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని వందపడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయడానికి కృషి**



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే విధంగా ఆసుపత్రి అభివృద్ధి కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రూ.50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు,ఆసుపత్రి ముందు షెల్టర్ నిర్మాణానికి రూ.రూ. 7లక్షల స్వంత నిధులు వెచ్చించిన ఎమ్మెల్యే బండారు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని పేద మరియు మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించే విధంగా అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సుమారు రూ.50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో సమగ్ర ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పురుషుల, స్త్రీల వార్డులకు సీలింగ్ ఏర్పాటు చేసి, నూతన ఫ్యాన్లు అమర్చినట్లు చెప్పారు. మరుగుదొడ్లలో పూర్తిగా పాడైన ప్లంబింగ్ వ్యవస్థను తొలగించి, ఆధునిక సదుపాయాలతో పునర్నిర్మాణం చేసినట్లు వెల్లడించారు. రోగుల సౌకర్యార్థం మంచాలు, పరుపులు మార్పు చేసి, చిన్నపిల్లల వార్డులో బేబీ వార్మర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పాత కిటికీల స్థానంలో కొత్త యూపీవీసీ ఓపెన్ విండోలను ఏర్పాటు చేయడం, వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని మూడు వాటర్ కూలర్లను ఏర్పాటు చేయడం, ఆసుపత్రి పరిసరాల్లో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. అదనంగా, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మార్చి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శానిటేషన్ విషయంలో ఎక్కడా రాజీపడబోమని, ఆసుపత్రి పరిశుభ్రతకు పారిశుధ్య కార్మికులు కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సహకారం అందిస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కంఠంశెట్టి శ్రీనివాస్, పల్లికొండ సుధీర్ కుమార్, చిట్టూరి లక్ష్మి సేవలను అభినందించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం మరువలేనిదని తెలిపారు. ఏ సమస్యను తెలియజేసినా వెంటనే స్పందించి పరిష్కారం చూపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి కృషి**

కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 1999లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయబడిందని గుర్తుచేశారు. ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులతో ఆసుపత్రి కార్పొరేట్ స్థాయికి చేరువవుతోందని, రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు, మందులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. తన సొంత నిధులతో రూ.7 లక్షల వ్యయంతో ఆసుపత్రి ముందు షెల్టర్ నిర్మించినట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం కమిటీ సభ్యులు, వైద్యులు సమిష్టిగా కృషి చేస్తున్నారని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

# కొత్తపేట గ్రామ అభివృద్ధి పనుల వేగవంతంపై చర్చ

## ప్రత్యేక అధికారుల పాత్రపై కీలక సమావేశం



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : కొత్తపేట మండలంలో పంచాయతీ ప్రత్యేక అధికారుల (స్పెషల్ ఆఫీసర్లు) పాత్రలు, బాధ్యతలపై ముఖ్య సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో సీవీఏపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీఎస్ఓ ఎస్‌టీవీ రాజేశ్వరరావు పాల్గొని కార్యక్రమాన్ని సమర్థవంతంగా నడిపించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, పారదర్శకత, సమర్థవంతమైన పాలన లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ప్రత్యేక అధికారుల బాధ్యతలను స్పష్టీకరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పర్యవేక్షణ, నిధుల వినియోగంలో పారదర్శకత, గ్రామ అభివృద్ధి పనుల వేగవంతంపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శుల పాత్రపైనా సమగ్రంగా చర్చిస్తూ గ్రామస్థులకు అవసరమైన సేవలను సమయానికి అందించడం, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, ప్రత్యేక అధికారులు, కార్యదర్శుల సమన్వయం వంటి అంశాలను వివరించారు. గ్రామ స్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలనే దిశగా సూచనలు చేశారు. ప్రతి కార్యక్రమంపై సమయానికి నివేదికలు సమర్పించడం, ఉన్నతాధికారులకు నిరంతర సమాచారం అందించడం అవసరమని సమావేశంలో ప్రాధాన్యతనిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించి గ్రామ అభివృద్ధిలో చురుకుగా పాల్గొనాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు.

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా

# రెడ్డి సుబ్రహ్మణ్యం నియామకం

**పలువురు అభినందనలు**

**అధినేత చంద్రబాబు, యువ నేత లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపిన రెడ్డి సుబ్రహ్మణ్యం**



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ జాతీయ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ తెలుగుదేశం పార్టీ అధిష్టానం తాజాగా కీలక నియామకాలు చేపట్టింది. ఇందులో భాగంగా పార్టీ సీనియర్ నాయకుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన రెడ్డి సుబ్రహ్మణ్యంని తెలుగుదేశం జాతీయ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.అదే సందర్భంగా పార్టీ నిర్మాణంలో కీలక మార్పులు చేస్తూ, యువ నాయకుడు నారా లోకేష్‌ని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**నాలుగు దశాబ్దాల పైగా రాజకీయ అనుభవం**

రెడ్డి సుబ్రహ్మణ్యం గత నాలుగు దశాబ్దాలు పైగా పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా,పొలిట్ బ్యూరో సభ్యుడిగా అనేక పదవులు సమర్థవంతంగా నిర్వహించారు.అట్టడుగు స్థాయి నుంచి ఎదిగిన నేతగా కార్యకర్తలకు అత్యంత సన్నిహితంగా మెలుగుతూ ప్రస్తుతం నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఆశీస్సులతో జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నారా లోకేష్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**ఇది పదవి కాదు, బాధ్యత**

"పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను.ఈ నియామకాన్ని ఒక పదవిగా కాకుండా, పార్టీ బలోపేతానికి నాకు అప్పగించిన గొప్ప బాధ్యతగా స్వీకరిస్తున్నాను" అని ఆయన స్పష్టం చేశారు.

**పార్టీ బలోపేతమే లక్ష్యం**

నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, నారా లోకేష్ యువ నాయకత్వంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడమే తన ముందున్న లక్ష్యమని తెలిపారు. కార్యకర్తల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని, శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డ్వాక్రా యానిమేటర్లకు ఉచిత మొబైల్ ఫోన్లను

# పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : కొత్తపేట మండలం కొత్తపేట గ్రామపంచాయతీ కార్యా లయం వద్ద జరిగిన కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న 64 మంది డ్వాక్రా (వివోఏ) యానిమేటర్లకు ఉచిత మొబైల్ ఫోన్లను కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరియు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (యాస్ఈఆర్పి) ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అనేక సంక్షేమ మరియు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు. యాస్ హెచ్ సి బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలు, ఉన్నతి వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి, అలాగే యాప్‌ల ద్వారా సర్వేలు నిర్వహించడం, సభ్యుల వివరాలు సేకరించడం, డేటా నిక్షిప్తం చేయడం వంటి పనులకు ఈ మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.డ్వాక్రా యానిమేటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మరింత ఉత్సాహంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అలాగే కొత్తపేట మండలంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఈ ద్వారా అధిక మొత్తంలో బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కాట్రేనికోనలో అన్న క్యాంటీన్ ప్రారంభం

**పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ మరో అడుగు**



కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ : ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ కాట్రేనికోన మండల కేంద్రం కాట్రేనికోనలో ఈరోజు అన్న క్యాంటీన్ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉంది. పేద ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపారు. ముమ్మిడివరం ప్రధాన కేంద్రంలో ఇప్పటికే అన్న క్యాంటీన్ ప్రారంభించగా, ఇప్పుడు కాట్రేనికోనలో మరో క్యాంటీన్ ప్రారంభించడం ద్వారా పేదల ఆకలి తీర్చే దిశగా మరో ముఖ్యమైన అడుగు ముందుకు వేసిందని అన్నారు. అలాగే అమలాపురం ఎంపీ గంటి హరీష్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ గుత్తుల సాయి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలకు అందుబాటులో తక్కువ ధరలో భోజనం అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో కూడా అన్న క్యాంటీన్స్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు మరియు మీడియా మిత్రులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇంటర్మీడియట్ ఫలితాల్లో విజయ దుందుభి...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు విద్యా సంస్థల విద్యార్థులు అత్యధిక మార్కులు, స్థానాలను సాధించారు. విద్యా సంస్థల ఃకు, తల్లి తండ్రులకూ మంచి పేరును, గుర్తింపును తెచ్చారు. మండల కేంద్రం శంఖవరంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు కొత్త చరిత్ర సృష్టించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 82 శాతం, ద్వితీయ సంవత్సరం 77% శాతం ఫలితాలను సాధించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కే.దేవి 457, బైపీసీలో ఎల్.జోత్స్న 423, సిఇసిలో ఎస్.దుర్గ 485 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కే.ఝాన్సీ 941, బైపిసిలో పి.అనూష 970, సిఇసిలో ఎం.అమృత 884 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ ఏ.వీరరాజు, శంఖవరం గ్రామ పెద్దలు పర్వత సురేష్, స్కూల్ కమిటీ చైర్మన్ జి.లక్ష్మీజ్యోతి, శంఖవరం మండలం విద్యాశాఖ అధికారులు ఎస్వీ.రమణ టి.గోవింద్ తదిరులు అభినందించారు. అలాగే ఇదే శంఖవరంలోని మరో ప్రభుత్వ విద్యా సంస్థ ఐన కస్తూర్బా గాంధీ బాలికా జూనియర్ కళాశాల నుంచి ఇంటర్మీడియట్ 1 వ సంవత్సరం ఎంపీసీలో గ్రూప్ నుంచి 37 మంది విద్యార్థినిలు వార్షిక పరీక్షలకు హాజరు కాగా 34 మంది ఉత్తీర్ణులు అవ్వగా ముగ్గురు మాత్రం ఉత్తీర్ణత సాధించలేక పోయారు. ఉత్తీర్ణులు అయ్యిన వారు మొత్తం 92 శాతం ఉత్తీర్ణతను సాధించారు. వీరిలో తిక్కడ రూప 427, ఎన్.రూపసాయిదుర్గా 421, ఎన్.షణ్ముక 420, టి.యమునా సాగరి 414 చొప్పున అత్యధిక మార్కులను సాధించారు. ఇక 2 వ సంవత్సరం ఎంపీసీలో గ్రూప్ నుంచి 33 మంది విద్యార్థినిలు వార్షిక పరీక్షలకు హాజరు కాగా వారిలో 18 మాత్రమే ఉత్తీర్ణులై 55 ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. వీరిలో తంగెల్లె తనూజా 952, కెనవ్యశ్రీ 938, ఆర్.యామిని శ్రీవల్లి 931, ఎం.వెంకట సత్య 917, కె.గాయత్రి 906, ఎ.బేబీ 901 చొప్పున అత్యధిక మార్కులను సాధించారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి ప్రాంతంలోని ఎస్ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి తన సత్తా చాటింది. తక్కువ ఫీజులతో అత్యుత్తమ బోధన అందిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న ఈ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కర్నీడి మౌనిక 1000 మార్కులకు 978 మార్కులను సాధించి కళాశాల ప్రతిష్ఠను పెంచగా, దాడిశెట్టి చంద్రకళ 974 మార్కులతో ప్రతిభ చాటింది. జూనియర్ బైపీసీ విభాగంలో పల్లాటి లాస్య మనస్విని 455 మార్కులకు గాను 445 మార్కులు సాధించి మెరిసింది. అలాగే జూనియర్ ఎంపీసీ విభాగంలో పెట్టిం శివ సాహితి, తేజోమూర్తుల ఉమా గాయత్రి ఇద్దరూ కూడా 470 కీ 440 మార్కులు సాధించి విశిష్ట ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలను కళాశాల చైర్మన్ సుంకర వీరబాబు, ప్రిన్సిపాల్ రామిశెట్టి బులి రమణ అభినందించారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. స్థానికులు, తల్లి, దండ్రులు కళాశాల యాజమాన్యాన్ని, అధ్యాపకులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



**ప్రతిభ చాటిన అడపా హారిక దుర్గా లక్ష్మి ...**

బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి అడపా సోమేశ్ తనయ హారిక దుర్గా లక్ష్మి అద్భుత ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించి ఉత్తమ ఫలితంతో అందరి దృష్టిని ఆకర్షించారు. హారిక దుర్గా లక్ష్మి ప్రస్తుతం కాకినాడలోని శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలోని ఐపీఎల్ క్యాంపస్‌లో ఇంటర్ ఎంపీసీ చదువుతోంది. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఈ స్థాయి మార్కులు సాధించడం పట్ల ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థిని తండ్రి అడపా సోమేశ్‌తో పాటు కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు వైసీపీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు ఫోన్ ద్వారా హారిక దుర్గా లక్ష్మిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో కూడా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడానికి కృషి చేస్తానని హారిక దుర్గా లక్ష్మి చెప్పారు.

**981 మార్కులతో సత్తా చాటిన ప్రవల్లిక...**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో అచ్చే ఆర్ఎస్ఎస్ ప్రవల్లిక 1000 మార్కులకు గాను 981 మార్కులను సాధించి విశేష అత్యుత్తమ ప్రతిభ చూపింది. ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామానికి చెందిన ప్రవల్లిక సాధారణ కుటుంబానికి చెందిన అచ్చే వీరబాబు కుమార్తె. ప్రస్తుతం ఆమె కాకినాడలోని శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్‌లో ఐపిఎల్ క్యాంపస్ లో చదువుతోంది. ఇంతకు ముందు పదో తరగతిలో కూడా సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానాన్ని సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఇంటర్లో కూడా అత్యుత్తమ మార్కులు సాధించడంతో గ్రామ ప్రజలు, నాయకులు, తల్లిదండ్రులు ఆమెను అభినందించారు. ప్రవల్లిక భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.

## అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవం




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి ఉద్దేశంతో ఈ అన్నా క్యాంటీన్లు శ్రీకారం చుట్టారని ఇది పేదలక వరం అని రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ అన్నారు బుధవారం రూరల్ మండలం తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన అన్న క్యాంటిన్‌ను ప్రారంభించారూ. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ జంక్షన్‌లో ప్రారంభించడం వల్ల ఎంతో మంది కార్మికులకు తక్కువ ధరకే భోజనం టిఫిన్ లభించడంజరుగుతుందన్నారు స్థానికులు తప్పనిసరిగా ఈ అన్నాకంటిను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు తిమ్మాపురం చెందిన జనసేన నాయకుడు తాతాజీ మాట్లాడుతూ ఇక్కడ భావనాన్ని నిర్మించకుండా మాజీ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఎన్నో అడ్డంకులు కల్పించారని అయినప్పటికీ వాటిని అధిగమించి ప్రభుత్వ స్థలంలో నిర్మించామన్నారు దీనికి అంతటికి ఎమ్మెల్యే నానాజీ గారి సహకారాలే కారణమన్నారు ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా కాపాడడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు మీజ పేరాబత్తుల రాజశేఖరం కటకం శెట్టి బాబీ రంభాల వెంకటేశ్వర రావు , పెంకే శ్రీనివాస బాబా , నూరుకుర్తి వెంకటేశ్వర రావు, వల్లూరి రాజా, కర్రి వెంకటరాజు,బోళ్ల కృష్ణ మోహన్ కరెడ్ల గోవింద్ , బండారు మురళి అద్దంకి వీరబాబుతిరుమని కుమారి స్వామి , సోదే ముసలయ్య బత్తుల దొరబాబు, పాండ్రంకి రాజు, కాళ్ళరాజు, కృష్ణ, మహేష్ గేదల చిన్నారావు సంతోష్ భవాని రమ్య మాలతీ లక్ష్మి స్వాతి , సత్య దుర్గ, పెదపూడి శ్రీరామ గారు,అడపా గంగాధర్,ఆకుల వెంకటరమణ, చోడిశెట్టి ఇంద్ర, నందికా లోవ రాజు ,సుందర సతీష్ పితాని లీలావతి,స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మండే ఎండల్లో చల్లని చెరుకు రసం




**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న వేళ, చల్లని చెరుకు రసం అందిస్తూ ప్రజల దాహం తీర్చడమే కాకుండా తన కుటుంబానికి ఆధారంగా నిలుస్తున్నాడు పెదనానపెల్లి గ్రామానికి చెందిన సూరిబాబు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలంలోని పొలాల మధ్య చిన్న షెడ్ ఏర్పాటు చేసి చెరుకు రసం వ్యాపారం ప్రారంభించిన సూరిబాబు, ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచే పనిని ప్రారంభిస్తారు. సమీప ప్రాంతాల నుంచి చెరుకు తెప్పించి తాజా రసం తయారు చేసి కస్టమర్లకు అందిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో రైతులు, కూలీలు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఈ స్టాల్‌ను సందర్శిస్తున్నారు. చెరుకు రసం తాగుతూ కొంతసేపు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ చిన్న వ్యాపారం ఇప్పుడు ఒక చిన్న విశ్రాంతి కేంద్రంలా మారింది. సూరిబాబు మాట్లాడుతూ, "ఏ పని చిన్నది కాదు. కష్టపడి పనిచేస్తే జీవనం సాగుతుంది. కుటుంబాన్ని పోషించేందుకు ఈ వ్యాపారం ప్రారంభించాను. ప్రజలు ఇష్టపడుతూ రావడం ఆనందంగా ఉంది" అని తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ, సూరిబాబు లాంటి కష్టజీవులు గ్రామీణ సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. స్వయం ఉపాధితో నిలబడటం గొప్ప విషయమని, ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి చిన్న వ్యాపారాలు పెరగడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, యువత కూడా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచిస్తున్నారు. మండే ఎండల్లో చల్లని చెరుకు రసం అందిస్తూ ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్న సూరిబాబు... తన కష్టంతో జీవితాన్ని ముందుకు నడిపిస్తూ గ్రామీణ జీవనానికి ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తున్నారు.

## శ్రీ రూపులమ్మ 136వ జాతర మహోత్సవాలు



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరంలో గ్రామ దేవత శ్రీ రూపులమ్మ అమ్మవారి 136వ జాతర మహోత్సవాలను ఈ నెల 16,17 తేదీలలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.జాతర మహోత్సవాలను నానిశెట్టి నారాయణరావు మెమోరియల్,నానిశెట్టి చారిటబుల్ ట్రస్ట్,మౌంట్ కార్మెల్ స్కూల్ (కాకినాడ)ఆధ్వర్యంలో వివేకానంద సేవా సమితి సమక్షంలో నిర్వహించబడుతున్నాయి.గరగ నృత్యములు,శక్తి వేషములు,పల్లవి ఆర్కెస్ట్రా,తీన్మార్ బ్యాండ్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.అనంతరం 17వ తారీకు తీర్థ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీ లలిత సహస్రనామ పారాయణం,కోలాట ప్రదర్శనలు నిర్వహించబడును.ఆలయ ధర్మకర్తలు కీర్తిశేషులు తూమురౌతు సోమరాజు కుమారుడు సూర్యనారాయణ,మల్లికార్జునరావు అనుమతితో కీర్తిశేషులు నానిశెట్టి నారాయణరావు కుమారులు నానిశెట్టి మణికంఠ,నాని శెట్టి వీరాంజనేయ సాయిరాం,మిత్రుడు పాబోలు వెంకట వినోద్ బాబు లు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.ఈ ఉత్సవాలకు గ్రామ పెద్దలు,భక్తులు,ప్రజలందరూ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కృప కటాక్షాలకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శిగా పర్వత సురేష్ నియామకం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత పర్వత సురేష్ కు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవి లభించింది. ఈ మేరకు పార్టీ సామాజిక మాధ్యమాల వేదికగా బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బుధవారం పార్టీ కమిటీల సభ్యులను నియమించారు. తెలుగు దేశం పార్టీని రాబోయే 2029 ఎన్నికలకు సమరోత్సాహంతో సిద్ధం చేసే క్రమంలో చంద్రబాబు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కింది స్థాయి కార్యకర్తలకు కూడా పార్టీ పదవులను కట్టబెట్టి అత్యున్నతంగా గౌరవించారు. దీనిలో భాగంగానే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శుల్లో ఒకరుగా ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మండల కేంద్రం శంఖవరంలోని పర్వత సురేష్ ను చంద్రబాబు నియమించారు. పర్వత సురేష్ ను ఇటీవల అన్నవరం శ్రీ వీర వెంకట సత్య నారాయణ స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుల్లో ఒకరిగా నియమించారు. పార్టీలో సీనియర్ నేతగా ఉన్న పర్వత సురేష్ కు రెండు పదవులు రావడంతో నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు ఆనందంలో మునిగి పోయారు. ఈ సందర్భంగా పర్వత సురేష్ మీడియాతో మాట్లాడుతూ 1994 లో తెలుగుదేశం పార్టీలో నా రాజకీయ ప్రయాణం మొదలై నేటి వరకూ కొనసాగుతూ వస్తోందని, లోగడ తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో పార్టీలో వివిధ పదవులు, హోదాల్లో తాను భాద్యతలను నిర్వర్తించా నన్నారు. ప్రతీ ఎన్నికలను ఛాలెంజ్ గాతీసుకుని పార్టీ కోసం పని చేసానన్నారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సిఫారసుతో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ సానా సతీష్ బాబు ఆశీస్సులతో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవిని పార్టీ కట్టబెట్టిందనిని పర్వత సురేష్ తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పర్వత సురేష్ కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతో ఉత్తమ ఫలితాలు

### రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 927 మార్కులతో విజయకేతనం - ఇంటర్మీడియట్ ఫలితాలపై సంతోషం వ్యక్తం చేసిన కళాశాల ప్రిన్సిపాల్ రామారావు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిందని కళాశాల ప్రిన్సిపాల్ రామారావు తెలిపారు. పరిమిత వనరుల మధ్య విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో ఎంపీసి,బైపిసి,సిఇసి గ్రూపుల్లో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించారని, ముఖ్యంగా ఎం.పి.సి విభాగంలో విద్యార్థిని పిఎస్ఎస్ త్రివేణి 927 మార్కులు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఇతర విభాగాల్లోనూ పలువురు విద్యార్థులు 800కు పైగా మార్కులు సాధించారని చెప్పారు. మొదటి సంవత్సరం వృిజ విభాగంలో 62 మంది విద్యార్థుల్లో 44 మంది ఉత్తీర్ణత సాధించి సుమారు 71 శాతం ఫలితాలు నమోదు అయ్యాయని, రెండో సంవత్సరం ఎంపిసి విభాగంలో 61 మందిలో 37 మంది ఉత్తీర్ణులై సుమారు 61 శాతం ఫలితాలు నమోదయ్యాయని వెల్లడించారు. ఇక బైపిసి, సిఇసి గ్రూపుల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని, కొందరు విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. ముఖ్యంగా మొదటి సంవత్సరంలో పలువురు విద్యార్థులు 470కు గానూ 442, 430, 433 మార్కులు సాధించడం విశేషమని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ నాణ్యమైన విద్య అందుతుందని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపాల్ రామారావు తెలిపారు. కళాశాల ఫలితాలపై స్థానికులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ పలువురు సిబ్బందిని అభినందించినట్లు తెలిపారు.

## ఐదవ సారి స్టేట్ ర్యాంక్ సాధించిన శ్రీ సూర్య విద్యాసంస్థలు

### ఇంటర్ ఫలితాలలో శ్రీ సూర్య విద్యాసంస్థలు హవా





**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వరుసగా ఐదవ సారి స్టేట్ రెండవ ర్యాంకును సాధించిన శ్రీ సూర్య విద్యాసంస్థలు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ద్వితీయ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు ఎర్రవరం శ్రీ సూర్య విద్యాసంస్థలు లో చదివిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి జిల్లాకే గర్వకారణం అయ్యారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ కెవివి సత్యనారాయణ (వీరబాబు) మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎలమంచిలి శేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అంకితభావంతో విద్యాబోధన చేయడంతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం సాధ్యమవుతుందన్నారు. ఇంటర్ ఫలితాలలో వరుసగా 5 వ సారి ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 466 మార్కులతో సమెట్ల నవ్య శ్రీ, నెమాల 463, మార్కులతో, 461, మార్కులతో గంధంశెట్టి మణికుమారి, 460 మార్కులతో పెంటకోట అనిల్, శరకణం వెంకటేశ్ సత్తాచాటారు. బైపిసి విభాగంలో 455 మార్కులకు గాను 446 మార్కులతో ఉజ్జి మానస సత్య శ్రీ, తరుణ్ స్థానంలో నిలిచారు. 444 మార్కులతో తోట అశ్విని కడప లక్ష్మీ అశ్విత ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 983, 982, 981, మార్కులతో షేక్ వహీదా, గడ్డం జస్వంత్ కార్తీక్, దేవకి అఖిల్, ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానంలో నిలిచారు. బైపీసీ విభాగంలో 966 మార్కులతో నడింపల్లి జాస్మిన్ ప్రియా, 965 మార్కులతో పూడి లోకేశ్వరి, 962 మార్కులతో అర్జ ప్రియాంక నిలిచారు. అనంతరం ఇంటర్ ఫలితాలలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ విద్యార్థులను శ్రీ సూర్య కళాశాల తరఫున కరస్పాండెంట్ కొలిమల్ల వీర వెంకట సత్యనారాయణ ప్రిన్సిపల్ ఎలమంచిలి శేఖర్, శుభాకాంక్షలు తెలిపారు. గంటా శ్రీ రాంప్రసాద్ సింగిరెడ్డి స్వామి సుందరం డివి పాళేశ్వరరావు, సామన వీర వెంకట సత్యనారాయణ తన సురేష్ తదితర అధ్యాపక బంధం అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఏలేశ్వరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల

## విద్యార్థినులు ఇంటర్ ఫలితాలలో హవా

### శుభాకాంక్షలు తెలిపిన కళాశాల ప్రిన్సిపల్ శారద



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం నగర పంచాయతీలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల నందు విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో సత్తా చాటుకున్నారు. మొత్తం 61మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలలో పాల్గొనగా 59 మంది విద్యార్థునిలు ఉత్తీర్ణత సాధించారు. బైపిసి విభాగంలోబి కావ్య 974 మార్కులతో కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. 952 మార్కులతో యు అనిత, ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎంపీసీ విభాగంలో బి.దేని నాగ సాయి శ్రీ 957 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, ఎం సత్య 920 మార్కులు,తో ద్వితీయ స్థానంలో నిలిచింది.ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపల్ సారథితోపాటు అధ్యాపకులు అభినందించారు. ఇంటర్ పూర్తి చేసుకుని ఉన్నత చదువులకి వెళ్ళనున్న విద్యార్థినులు ఉత్తమ విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులను అధ్యాపకులను పలువురు ప్రముఖులు అభినందించారు.

## బద్రవరం గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ




### హాజరైన మండల పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి

**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం భద్రవరం గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి సూచనలమేరకు 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు సెక్టార్ అద్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు. ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలలో 15 రోజులు పాటు ఈ పోషణ పక్వాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 7వరోజు కార్యక్రమంలో భాగంగా భద్రవరం గ్రామంలో గ్రామ సచివాలయం నందు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. చిన్నారులకు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి మెదడు 80% అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలైన ఐస్క్రీం చక్కెర వంటి పదార్థాలకు స్క్రీన్ టీవీ మొబైల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు. తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు సూచించారు. దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగా వికాసం పెరుగుతుందన్నారు. మంచిపోషకాలుఅందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికిసహాయపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపర్తి చైర్మన్ పెంటకోట మోహన్, ఎంపీటీసీ కొప్పుల బాబ్జి, టీడీపీ నాయకులు జిగటాపు సూరిబాబు, తాజా మాజీ సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు,ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి, పంచాయతీ కార్యదర్శి, ఐసిడిఎస్ టీచర్‌లు, హెల్పర్‌లు, పలువురు గర్భిణీలు బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## కరప సొసైటీలో సిబ్బంది అవకతవకలు

### 48 గంటల్లో సొసైటీ ఖాతాకు జమ చేయించిన చైర్మన్, కమిటీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండల కేంద్రమైనకరప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఈ మధ్యకాలంలో అక్రమ రవాణా ఎరువులు అంటూ మీడియాలో పత్రికల్లో వార్తలు రావడం జరిగింది. ఈ వార్తలు ఆధారంగా సంబంధిత జిల్లా అధికారులు డిసిఒ శ్రీనివాస్ రెడ్డి, జెడి విజయ్ కుమార్ స్పందించడం జరిగింది. వీరు సొసైటీలో రికార్డులు పరిశీలించారు పరిశీలనలో ఎరువులు అక్రమ రవాణా అన్నది పూర్తిగా అవాస్తము అని తేల్చారు అయితే సొసైటీ నుండి ఎరువులు అమ్మిన బస్తాలకు సొమ్ములకు వ్యత్యాసం కనుగొన్నారు 119 బస్తాలు సొమ్ములు 74 వేల రూపాయలు పక్కదారి పట్టినట్టు గుర్తించారు. ఎవరైతే ఈ ఎరువులు అమ్మకాలు జరిపారో వారి ను బాధ్యులుగా గుర్తించి ఈ అవకతగలకు సంబంధించిన సొమ్ములు తిరిగి చెల్లించేందుకు48 గంటలు సమయం ఇచ్చి సొసైటీకి చెల్లించాలని ఈ బాధ్యతలను సొసైటీ అధ్యక్షులుగా నాకు మా కమిటీ కు ఆ బాధ్యుల నుండి సొమ్ములు కట్టించాలని, ఈ అవకతవకలకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులు ఆదేశించారు. ఈనెల 13న ఎరువుల అమ్మకం సొమ్ములు అవకతవకలు పాల్పడిన వారి నుండి రూ 74 వేల రూపాయలు సొసైటీ ఎకౌంట్లో జమ చేయటం జరిగింది. ఈ సమాచారాన్ని ఉన్నత అధికారులకుతెలియపరచడం జరిగింది ఈ సమస్య పరిష్కారమయింది. కరప సొసైటీ కి మంచి పేరు ఉన్నది .గత ప్రభుత్వంలో ఈ సొసైటీలో కొన్ని అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆ సంఘటన పక్కదారి పట్టింది దీంతో సొసైటీ పై రైతులకు, ప్రజలకు ఒక తప్పుడు అభిప్రాయం ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలో సొసైటీలో ఎరువులు అక్రమ రవాణా కాదు అమ్మిన సొమ్ములుఅవకతవకలుపాల్పడిన సిబ్బంది అని అధికారులు తీర్చడం జరిగిందని మరొకసారి తెలుపుతున్నామని. సొసైటీని ఉన్నత స్థానంలో ఉంచాలని స్వచ్ఛమైన పరిపాలనతో బాధ్యతాయుతంగా ఉన్నాం అని తెలిపేందుకే ఈ మీడియా సమాచారం పెట్టడం జరిగిందని అధ్యక్షులు భవాని శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ సత్య, డైరెక్టర్లు సోడిశెట్టి సత్యనారాయణ, అడపా శ్రీను, సీఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## గ్రామ కమిటీలతోనే టీడీపీ బలోపేతం

### కోనసీమ జిల్లా అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ కమిటీల ద్వారానే తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం పేర్కొన్నారు. బుధవారం కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో గ్రామ కమిటి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరభ్రహ్మం మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి గ్రామ స్థాయి కార్యకర్తల కృషి ద్వారానే నిజమైన బలం ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం సమావేశంలో తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మేడిశెట్టి దుర్గారావు, ఉపాధ్యక్షుడిగా రెడ్డి చిన్నారావు, కార్యదర్శిగా యాళ్ళ సత్తిరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు నారాయణమూర్తి మాట్లాడుతూ, గ్రామ కమిటీలు ప్రజలతో సన్నిహితంగా ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన టేకుమూడి దుర్గారావు మాట్లాడుతూ గ్రామంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో దుగ్గుదుర్రు సహకార సంఘం అధ్యక్షుడు యాళ్ల తనిబాబు, మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎన్డీఏ నాయకులు చేతుల మీదుగా

## "అన్న క్యాంటీన్" ప్రారంభం



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి సంక్షేమంతో పాటు పేదోడి ఆకలి తీర్చడానికి "అన్నా క్యాంటీన్"లను ఏర్పాటు చేయడం జరుగుతుందని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. బుధవారం రాజానగరంలో ఎన్డీఏ నాయకులు, ప్రభుత్వ అధికారులు అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆశయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తూచా తప్పకుండా పాటిస్తున్నారని, రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమంతో పాటు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్ లను మూసివేసి, నిరుపేదలను ఆకలితో మలమల మార్చిందన్నారు.ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అందించడమే ధ్యేయంగా పనిచేస్తూ ఇది మంచి ప్రభుత్వంగా ప్రజల మనలను పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్ శివరాముడు,ఎంపీడీవో జేఏ ఝాన్సీ,ఎన్డీఏ నాయకులు గంగిశెట్టి చంటిబాబు,కంటే నాగకేశవరావు, తనకాల నాగేశ్వరరావు, తెలగంశెట్టి శ్రీనివాస్,రొంగల శ్రీనివాస్,దూది కాంతారావు,ముక్క రాంబాబు,గళ్ళ రంగా,నాతిపామ్ దొరబాబు,కొల్లం రత్నం, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సరస్వతి దాసరి అరవలమ్మ కళాశాల ప్రభంజనం

కరస్పాండెంట్ పెనకటి



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో కోరుకొండలోని సరస్వతి శ్రీమతి దాసరి అరవలమ్మ జూనియర్ కళాశాల విద్యార్థులు అధికమార్కుల సాధించి కోరుకొండ మండలస్థాయి విజేతగా నిలిచారని కరస్పాండెంట్ పెనకటి గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గంగాధర్ ఒక ప్రకటన విడుదల చేస్తూ గత ఏడాది ఇంటర్మీడియట్ లో తమ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ లో తమ కళాశాల మండలస్థాయిలో ప్రథమస్థానం కైవాసం చేసుకుందన్నారు.జి ఉస్మిత మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. డి.కావ్యశ్రీ వసంత మండల ప్రథమ స్థానంలో సత్తా చాటింది. జి.మోక్ష కాంచన సింధు విభాగంలో మండలంలో ప్రథమ స్థానాన్ని సాధించింది.కె నరీషా కళాశాలలో ద్వితీయలో నిలిచిందన్నారు.కె జయ లక్ష్మికళాశాల స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు మండలంలో ప్రథమ స్థానాల్లో నిలవడం చాలా ఆనందదాయకమన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకుల నిరంతర కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. ఈ సందర్భంగా అధ్యాపక సిబ్బందిని, విజేతలను అభినందిస్తూ పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో చదువులలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి, తల్లిదండ్రులకు గ్రామానికి కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్లో మంచి ఉత్తీర్ణత సాధించిన

## రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాల : కృష్ణ కిషోర్

కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : కోరుకొండ రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారని ఇన్చార్జి ప్రిన్సిపల్ కృష్ణ కిషోర్ తెలిపారు. బుధవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి పద్మజారాణి (హెచ్ ఇసి) 971 మార్కులు, వై కృష్ణ నిధి (సీఈసీ) 966 మార్కులు, కరిష్మా జ్యోతి (బైపిసి) 950 మార్కులు, వెంకట సాయి (ఎంపీసీ) 900 మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. అదేవిధంగా వృత్తివిద్య కోర్సులలో వై వినయ్ బాబు, గంగోత్రి అధిక మార్పులు సాధించరన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ, కళాశాల ఉపాధ్యాయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎంపీఎస్ హవా

పట్టణంలో అగ్రగామిగా ఎంపీఎస్

కళాశాల ఆవరణలో అంబరాన్ని తాకినా సంబరాలు



మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ : ఇంటర్ ఫలితాల్ ఎంపీఎస్ ప్రభంజనం సృష్టించింది. ఇంటర్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం రెండింటిలో టౌన్ ఫస్ట్ సాధించి సత్తా చాటింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో ఎంపీఎస్ విద్యార్థిని తాపేశ్వరపు విజయ లక్ష్మీ 470 మార్కులకు గానూ 467 మార్కులు సాధించి మండపేట టౌన్ ఫస్ట్ గా నిలిచింది. అలాగే ఇంటర్ రెండవత్సరం విద్యార్థిని గుమ్మెళ్ల సాహిత్య సిరి 1000 మార్కులకు గానూ 990 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ గా నిలిచింది. అదే విధంగా ఏకంగా 68 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు 400 కి మార్కులు సాధించగా 44 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు 900 కి పైగా మార్కులు సాధించారు. దీంతో కళాశాల వద్ద సంబరాలు అంబరాన్ని అంటాయి. విజయాలు సాధించిన విద్యార్థులు కళాశాల ప్రాంగణం వద్ద కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. కళాశాల స్థాపించిన తరువాత నుండి ప్రతి సంవత్సరం రికార్డులు సృష్టించడం ఎంపీఎస్ కే చెల్లిందన్నారు. ఇంతటి ఘనత సాధించిన విద్యార్థులకు, వారికి తర్ఫీదునిచ్చిన అధ్యాపకులకు, కళాశాల ప్రిన్సిపల్ సాయి గంగాధర్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పేద మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు అందుబాటులో కలిగిన విద్యను అందిస్తూ కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా రికార్డులు సృష్టించడం ఎంపీఎస్ కు ఎప్పటి నుండో వస్తున్న ఆనవాయితీ అని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాలను ఇదే విధంగా కాపాడుకుంటూ భవిష్యత్ లోనూ మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని చిన్నారావు ధీమా వ్యక్తం చేశారు.

# మంత్రి పార్థసారధివి దిగజారుడు మాటలు

**మిథున్ రెడ్డి మాటలకు వక్రభాష్యాలు - బిఆర్ అంబేద్కర్‌కు నిజమైన వారసుడు జగన్**

**మావిగాన్ చర్చను డైవర్ట్ చేసే ప్రయత్నం - మంత్రులకు సింగపూర్ టూర్ ఎందుకో..? - మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆక్షేపణ**



తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ : మంత్రి పార్థసారధి చేసిన వ్యాఖ్యలు దిగజారుడుగా ఉన్నాయని, ఎంపీ మిథున్ రెడ్డి మాటలను ఉద్దేశ పూర్వకంగా వక్రీకరిస్తున్నారని వైఎస్సార్సీపీ నేత, మాజీ ఎంపీ మార్గాని భరత్ విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, జగన్ ప్రతిపాదించిన "మావిగన్" అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నిజంగా అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని భరత్ పేర్కొన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా సమానత్వానికి కట్టుబడి ఉన్నారని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో బలహీన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి "రెడ్ బుక్" విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. ఎంపీ మిథున్ రెడ్డి వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకొని, వాటిని ఉన్మాదం, టెర్రరిజం అంటూ అభివర్ణించడం దురుద్దేశపూర్వకమని భరత్ అన్నారు. మంత్రి స్థాయిలో ఉన్న పార్థసారధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అనర్థమని మండిపడ్డారు. అమరావతి అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 9 మంది మంత్రులను సింగపూర్‌కు శిక్షణ పేరుతో పంపడం అవసరమా అని ప్రశ్నించారు. గతంలో రైతులను విదేశాలకు తీసుకెళ్లి మోసం చేసినట్లు ఇప్పుడు మంత్రుల విషయంలోనూ అదే జరుగుతోందని విమర్శించారు. జగన్ ప్రతిపాదించిన మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కారిడార్ (మావిగన్) అభివృద్ధికి దోహదపడే ఆచరణ సాధ్యమైన ప్రణాళిక అని, దీనిపై ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోందని తెలిపారు. అమరావతితో పోలిస్తే తక్కువ వ్యయంతో, ఎక్కువ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా వేదికలు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబంపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు తగవని హెచ్చరించారు.

## రాజమండ్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం

**– అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఇంటర్ విద్యార్థులు**

రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : మార్చి నెలలో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజమహేంద్రవరం విద్యార్థులు మంచి ఉత్తీర్ణతను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.త్రినాధరాజా ప్రకటనలో తెలియజేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధించామని తెలియపరిచారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్ జనరల్ విభాగం లో 65% సెకండ్ ఇయర్ లో 74% అదే విధంగా ఒకేషనల్ విభాగంలో ఫస్ట్ ఇయర్ లో 58 శాతం సెకండియర్ లో 72% తమ కళాశాల విద్యార్థులు ఉత్తీర్ణ సాధించారని తెలియజేశారు కాలేజీ టాపర్ 978 మార్కులు 1000 మార్కులకు గాను కుమారి నవ్యశ్రీ ఎంపీసీ విభాగం నుండి అదే విధంగా బైపీసీ విభాగం నుండి 1000 కి 960 మార్కులు కే శివకుమారి అలాగే వోకేషనల్ విభాగం నందు కే.కరుణ 971 మార్కులు సాధించాలని తెలియజేశారు.



అదే విధంగా ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ నుంచి షేక్ బిలాల్ 448 మార్కులు,బైపిసి నుంచి డి పావని 448 మార్కులు, సీఈసీ నుంచి 475 మార్కులు అదేవిధంగా ఒకేషనల్ విభాగంలో ఎం పి హెచ్ డబ్ల్యు గ్రూప్ నుండి సిహెచ్ దేవి ప్రశాంతి కి 489, ఎం అండ్ ఏటి గ్రూప్ నుండి హేమంత్ కుమార్ కు 486 మార్కులు ఓఏ విభాగం నుండి 473 మార్కులు సాధించారని ప్రకటనలో తెలియజేశారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఫలితాలు సాధించటంలో కృషిచేసిన కళాశాల సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

## అంబేద్కర్ జయంతిలో మేడాకు అడుగడుగునా నీరాజనాలు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాజమండ్రి క్వారీ ప్రాంతం సుబ్బారావు నగర్‌లో రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కు ఘనమైన స్వాగతంతో దారి పొడుగునా పూల వర్షం కురిపించి యువతీ యువకులు మేడా శ్రీనివాస్‌కు అనుకూలంగా నినాదాలతో హోరేత్తించారు. జండా సెంటర్ వద్ద అంబేద్కర్ జయంతి సందర్భంగా బారి కేక్ ను మేడా శ్రీనివాస్ తో కట్ చేయించి స్థానికులకు మేడా చేతులు మీదుగా భోజనాలు వడ్డింప చేసారు. మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ, మీరు ఎవరు అంటరాని వారు కాదని, ప్రస్తుతం పాలించే వారే ఆది తరం అంటరాని వారని, అంబేద్కర్ ఉద్యమ స్ఫూర్తి కూడా అదేనన్నారు. కాలక్రమంగా కొంతమంది అంబేద్కర్ వారసులు అంటరాని వారు అన్నట్టుగా ఒక అబద్ధపు ప్రచారానికి ఖరీదైన ప్రచార మార్గాల ద్వారా బలం చేకూర్చారు. అంబేద్కర్ లక్ష్యాన్ని వక్రీకరించి తక్కువ కులాలు అంటు ఒక కుల కేటగిరిని నియమించి వ్యూహాత్మకంగా తక్కువ కులం అంటు ఒక ముద్ర వేసి కుల రిజర్వేషన్ ను కేటాయించారు .



సంపదను పాలకులు దోచుకుంటు సృష్టించిన అంటరాని కులానికి కుల కేటగిరి రిజర్వేషన్ కల్పించారు . నిజానికి ప్రస్తుత పాలకులకు మించిన అగ్ర కులాలు మీవి అనే వాస్తవాన్ని మరుగున పెట్టి నాటి నుండి నేటి వరకు ఆ ద్రోహన్ని నడిపిస్తున్నారు . నిజానికి అంబేద్కర్ వారసులు అందరు మాకు కుల రిజర్వేషన్ వద్దు సంపదలో రిజర్వేషన్ కావాలి అని ఒక పోలి కేక పెడితే పాలకులు పంచెలు తడిచి పోవటం ఖాయం. దశబ్దలుగా మిమ్ములను వెంటాడుతున్న పేదరికం పోయి సంపన్న జీవితాలు మీ సొంతం అవుతాయని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాసా ఏసు,మాసా సుబద్ర,గెద్దాడ సుందరి, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని మేడా ను అభినందనలతో ముంచెత్తారు.

రాజమండ్రి బార్ అసోసియేషన్, ఐడియా సంయుక్త ఆధ్వర్యంలో

## అంబేద్కర్ జయంతి



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : రాజమండ్రి బార్ అసోసియేషన్, ఐడియా సంయుక్త, రాజమండ్రి బార్ అసోసియేషన్, ఐడియా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన జస్టిస్ న్యాయమూర్తి గంధం సునీత విచ్చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్‌వి ప్రసాద్, ఐడియా అధ్యక్షులు సునీల్ లయన్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అల్లంపల్లి రామకృష్ణ, జనరల్ సెక్రటరీ పెల్లూరి రమేష్, జాయింట్ సెక్రెటరీ సిపి రెడ్డి, ట్రెజరర్ దాసరి అమ్ములు, ఏపీ బార్ కౌన్సిల్ మాజీ సభ్యులు ముప్పాళ్ళ సుబ్బారావు, ఐడియా నాయకులు ఎం వి వి సత్యనారాయణ, బొమ్మారు బుజ్జి, సాకా సురేష్, అసోసియేషన్ ప్రతినిధులు నరసింగ శ్రీనివాస్,గేడి రాజేశ్వరి, సాయి కృష్ణ, శకుంతల, రాజు, భాను, బత్తుల రాజు, సీనియర్ న్యాయవాదులు గొందేసి శ్రీనివాసులు రెడ్డి, వైవిఎస్ శ్యామల, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఏ షరీఫ్ మాటలు హాస్యాస్పదం

**జమియత్ ఉలేమా ఏ హింద్ జనరల్ సెక్రటరీ షేక్ నిజాం విమర్శ**

**గౌరవ హైకోర్ట్ వారు మొట్టికాయలు వేసే వరకు స్పందించని మైనారిటీ శాఖ**



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : మైనారిటీ సెల్ ప్రిన్సిపాల్ సెక్రటరీపై కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్ కేసు నమోదు అయ్యి షోకాస్ నోటీసు జారీ అయ్యేంతవరకు స్పందించని మీరు ముస్లిం సమాజంలో పరువు పోతుందని పాత జీ.ఓ ను మార్చి ఉలేమా లతో నూతన కమిటీ వేయడం మైనారిటీల పట్ల మీ నిర్లక్ష్యం ప్రజలు గమనిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారులు జనాబ్ ఎంఏ షరీఫ్ సాహెబ్ హజ్ కమిటీ లో ధార్మిక పండితులు ( ఉలేమా ) లు లేకుండ కమిటీ వేయడం అధికారుల పొరపాటు వల్ల జరిగింది అన్న మీ మాటలతో రాష్టం లో ఉన్న ముస్లిం సమాజం నవ్వుకునే విధంగా ఉన్నాయి. టీడీపీ పార్టీ కార్యకర్తలను ధార్మిక పండితులుగా చూపుతూ రాష్ట్ర హజ్ కమిటీ లో స్థానం కల్పిస్తూ, నియమించిన చరిత్ర తెలుగుదేశంపార్టీకే దక్కుతుంది. కాల పరిమితి ముగిసిన స్థానిక సంస్థల ప్రజ ప్రతినిధులు హజ్ కమిటీలో సభ్యులుగా నియమితులై ఉన్నవారు అర్హులైతే? శాసనసభ్యుని కోటాలో(హఫీజ్ ఖాన్, మాజీ శాసన సభ్యులు )ను వక్ఫ్ పాలకవర్గ సభ్యుడుగా ఎన్నికైన సభ్యుడిని, శాసనసభ పదవీకాలం పూర్తి అయినందున రాష్ట్ర వక్ఫ్ బోర్డు పాలక వర్గం నుండి తొలగించి. శాసన సభ్యుని కోటాలో అధికార పార్టీ శాసనసభ్యులు ను ఆ స్థానంలో నియమించిన కూటమి ప్రభుత్వం మాజీ శాసన సభ్యడే అనర్హుడు అయ్యినప్పుడు స్థా నిక సంస్థ ల సభ్యుల సమయం పూర్తి అయ్యినవారు టీడీపీ హయాంలో ఎలా అర్హులు అయ్యారో టీడీపీ నాయకులు సమాధానం చెప్పాలి.

స్వయం సహాయక సంఘాలకు

## శిక్షణా కార్యక్రమం



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : సీతానగరం మండల మహిళా సమాఖ్య కార్యాలయం నందు స్వయం సహాయక సంఘాల సభ్యులకు 2026-2027 వార్షిక రుణ, జీవనోపాదులు ప్రణాళిక నిమిత్తం మండల సమాఖ్య అధ్యక్షురాలు కందికట్ల అరుణ కుమారి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఏపీయం సూరమ్మ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం జీవనోపాధికి వార్షిక రుణ ప్రణాళిక నిమిత్తం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదన్నారు.మండల స్థాయిలో ఉన్న గ్రామ సంఘం సహాయకులు,మండల సమాఖ్య కార్య నిర్వాహక సభ్యులకు మరియు ఈనారీ లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా సభ్యురాలుకి జీవనోపాధి నిమిత్తం భవిష్యత్తులో 2026-2027 సం. రంలో సభ్యురాలుకి అవసరం అయ్యే రుణాలను సైతం ఇప్పుడే ఈ సర్వే నందు నమోదు చేసి రుణం పొందే విధంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బ్యాంక్ లింకేజ్,ఉన్నతి,స్త్రీనిధి, సి.ఐ.ఎఫ్, రుణాలు సభ్యురాలికి ఎప్పుడు రుణం అవసరమో అనేది సభ్యురాలు యొక్క అంగీకారాన్ని ,అవసరాన్ని బట్టి రుణం తీసుకోవడానికి ముందుగానే ప్రణాళిక ఇప్పుడే సిద్ధం చేయాలని అన్నారు.అయితే ప్రస్తుతం సంఘ సభ్యులకు ఏ రుణంలో ఏ సభ్యురాలికీ అప్పు నిల్వ ఎంత ఉన్నది అనేది రికార్డు సిద్ధం చేసుకుని తద్వారా ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. అయితే సంఘం సమావేశం నిర్వహించి సభ్యులు యొక్క బయో మెట్రిక్ ద్వారా సర్వే చేసి సర్వర్ కి పంపాలన్నారు.తీసుకున్న ప్రతీ రుణం ముఖ్యంగా జీవనోపాధికి వినియోగించాలన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో సిసి హరిబాబు, ధారా లక్ష్మీ, ఎం. వెంకట లక్ష్మీ,వి.ఓ.ఎ వారు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతే

## కూటమి ప్రభుత్వ ధ్యేయం

**మైనారిటీ ముస్లిం యువతకు కంప్యూటర్ల కేటాయింపు అభినందనీయం**

**టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ హుస్సేన్**



మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ : రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు కంప్యూటర్లు కేటాయింపు చేయడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ పేర్కొన్నారు. మైనారిటీల అభివృద్ధి, ఉర్దూ భాష పరిరక్షణ, ప్రోత్సాహం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వ సలహాదారు ఎం.ఏ. అహమ్మద్ షరీఫ్ కృషిని ఆయన అభినందించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉర్దూ అకాడమీ 100 శాతం బడ్జెట్ వినియోగం సాధించడం చారిత్రాత్మక ఘట్టమని, ఇది మైనారిటీ విద్యాభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 36 ఉర్దూ అకాడమీ కేంద్రాలకు సుమారు 300 నూతన కంప్యూటర్ల కేటాయింపు యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించే కీలక చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమం అమలులో రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూఖ్ మార్గదర్శకత్వం ముఖ్య పాత్ర పోషించిందని తెలిపారు. అలాగే ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ కృషి, అంకితభావం ఈ విజయానికి ప్రధాన కారణమని సల్మాన్ హుస్సేన్ కొనియాడారు. సమర్థ నాయకత్వం ఉంటే సమాజానికి ఎంత మేలు జరుగుతుందో ఆయన నిరూపించారని అన్నారు. మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

ధవళేశ్వరం జూనియర్ కళాశాల విద్యార్థుల

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ

**మెరుగైన ఫలితాలు విద్యార్థులను అధికారుల ప్రశంస**



ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ : మార్చి నెలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఆర్.ఐ.ఓ ఐ. శారద తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 57% ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 68% ఉత్తీర్ణత నమోదు చేశారు. కళాశాల టాపర్‌గా సి.ఇ.సి గ్రూప్‌కు చెందిన ఎస్. సరిత 910/1000 మార్కులు సాధించింది. ఒకేషనల్ విభాగంలో పి. ఉమా మహేశ్వరి (ఏ & టీ గ్రూప్) 969/1000 మార్కులతో, యు.శ్రావణి (సి.ఎస్.ఈ గ్రూప్) 965/1000 మార్కులతో టాపర్స్‌గా నిలిచారు.అలాగే ప్రథమ సంవత్సరం టాపర్స్‌గా వి. సాయి యశ్వంత్ 479/500, పి.నవ్య 469/500 మార్కులు సాధించి ప్రతిభ చాటారు.

ఉర్దూ అకాడమీలకు

## కంప్యూటర్లు కేటాయించడం హర్షణీయం

**టీడీపీ నూర్బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్**



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : మైనారిటీల అభివృద్ధి, ఉర్దూ భాష పరిరక్షణ, ప్రోత్సాహం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ప్రభుత్వ సలహాదారు ఎంఏ అహమ్మద్ షరీఫ్‌లకు టీడీపీ నూర్బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు షేక్ సుభాన్ కృతజ్ఞతలు తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఉర్దూ అకాడమీ 100 శాతం బడ్జెట్ వినియోగం సాధించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఇది మైనారిటీ విద్యా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 36 ఉర్దూ అకాడమీ కేంద్రాలకు దాదాపు 300 నూతన కంప్యూటర్లు కేటాయించి యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. ఈ అభివృద్ధి చర్యల వెనుక ఆంధ్రప్రదేశ్ న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి నాశ్యం మహమ్మద్ ఫరూఖ్ మార్గదర్శకత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ కృషి, అంకితభావం సమాజం పట్ల ఉన్న నిబద్ధత ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. ఈ మహోన్నత కార్యక్రమాన్ని తమ భవిష్యత్ అభివృద్ధికి ముస్లిం యువత సద్వినియోగం చేసుకోవాలని షేక్ సుభాన్ కోరారు.

## రాపాక తూముల వద్ద బైకుల ఢీ



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రాపాక తూముల వద్ద రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. రహదారిపై ధాన్యం కుప్పలు ఆరేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి ఇసుక,ధాన్యం అడ్డంకులు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న అడ్డంకులను తొలగించాలని భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం



# బుల్లితెర రాములమ్మ క్రేజ్..

## ఒక్కో షోకు శ్రీముఖి రెమ్యునరేషన్ ఎంతో తెలుసా? నెలకు అన్ని లక్షల ఆదాయమా?

ప్రస్తుతం బుల్లితెరపై టాప్ యాంకర్ ఎవరంటే సుమ కనకాల పేరు చెప్పవచ్చు. అయితే ఆ తర్వాతి స్థానం బుల్లితెర రాములమ్మ శ్రీముఖినే అని చెప్పడంలో ఎలాంటి అతి శయోక్తి లేదు. ప్రస్తుతం చేతి నిండా టీవీ షోస్, రియాలిటీ షోస్ బిజీ బిజీగా ఉంటోంది అందాల తార. ఈటీవీ ప్రోగ్రాం పటాస్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది శ్రీముఖి. అంతకు ముందు జులాయి, నేను శైలజ వంటి సినిమాల్లో హీరో, హీరోయిన్లకు అక్కగా, చెల్లిగా నటించిన ఈ ముద్దుగుమ్మ బుల్లితెర ప్రోగ్రామ్స్ తోనే బాగా పాపులర్ అయ్యింది. ఓ వైపు గ్లామర్ తో ఆకట్టుకుంటూనే మరోవైపు సందర్భానికి తగ్గట్టుగా గలగలా మాట్లాడడం, కామెడీ పంచులు వేయడం ఈ ముద్దుగుమ్మ స్పెషల్ ట్యాలెంట్. అందుకే బిగ్ బాస్ వంటి రియాలిటీ షోలోనూ ఈ అందాల తార సత్తా చాటింది. రన్నరప్ గా నిలిచి తన క్రేజ్ ను అమాంతం పెంచుకుంది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత టెలివిజన్ ప్రోగ్రామ్స్ మాత్రమే కాకుండా, సినిమా ఆడియో ఫంక్షన్లు, ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ప్రైవేట్ ఓపెనింగ్స్ తో బాగా బిజీ బిజీగా మారిపోయింది శ్రీముఖి. అదే సమయంలో క్రేజీ అంకుల్స్, మ్యాస్ట్రో, భోళాశంకర్ తదితర సినిమాల్లోనూ నటించి మెప్పించిందీ అందాల తార. మొత్తానికి ఇప్పుడు బుల్లితెరపైనా, అప్పుడప్పుడు వెండితెరపైనా మెరుస్తూ మస్త్ బిజీగా ఉంటోందీ అందాల తార. ఇదే క్రమంలో తన క్రేజ్, పాపులారిటీకి తగ్గట్టుగానే రెమ్యునరేషన్ ను తీసుకుంటోంది. ప్రస్తుతం ఒక్క షో, ఈవెంట్ కోసం శ్రీముఖి దాదాపు రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లేదా ఫంక్షన్ హోస్ట్ చేయాలంటే ఆమె కనీసం రూ. 1.5 లక్షల నుండి రూ. 2.5 లక్షల మధ్య పారితోషికం తీసుకుంటుందని సమాచారం. ప్రస్తుతం ఈటీవీ, స్టార్ మా వంటి ఛానెళ్లలోని పలు ప్రోగ్రామ్స్ కు హోస్ట్ గా వ్యవహరిస్తోంది శ్రీముఖి. అలాగే నెలకు కనీసం 3 నుంచి 4 సినిమా ఈవెంట్లను కూడా హోస్ట్ చేస్తోంది. ఈ లెక్కన శ్రీముఖి నెలవారీ ఆదాయం సుమారు రూ. 20 లక్షల నుండి రూ. 30 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఈ బ్యూటీకి ఉన్న క్రేజ్, పాపులారిటీ దృష్ట్యా నిర్మాతలు కూడా ఆమె అడిగింది ఇచ్చేందుకు ఏ మాత్రం వెనకాడడం లేదు.

ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్..

# రామ్ చరణ్ పెద్ది విడుదల వాయిదా..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న లేటెస్ట్ సినిమా పెద్ది. ఉప్పెన డైరెక్టర్ బుచ్చి బాబు సనా తెరకెక్కిస్తోన్న ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాపై భారీ అంచనాలు ఉన్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగి ఉంటే రామ్ చరణ్ పుట్టిన రోజైన మార్చి 27నే ఈ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ పెద్ది. బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం మెగా అభిమానులంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో రాబోతున్న ఈ చిత్రంపై రోజు రోజుకీ హైప్ పెరుగుతుంది. ఇందులో చరణ్ పూర్తిగా రగ్గడ్ మాస్ లుక్ లో కనిపించనున్నారు. అలాగే ఈ సినిమాలో భారీ యాక్షన్ సీక్వెల్స్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఇటీవల విడుదలైన చరణ్ ఫస్ట్ గ్లింప్స్ చూస్తే సినిమా ఏ రేంజ్ లో ఉండబోతుందో అర్థమవ్వుతుంది. ఇక ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగా పెద్ది రిలీజ్ కోసం ఎదురుచూస్తున్న ఫ్యాన్స్ కు ఊహించని షాక్ తగిలింది, పెద్ది సినిమా మరోసారి వాయిదా పడింది. ఈ విషయాన్ని మేకర్స్ స్వయంగా అనౌన్స్ చేశారు. అన్నీ అనుకున్నట్లు జరిగి ఉంటే రామ్ చరణ్ పుట్టిన రోజైన మార్చి 27నే ఈ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. అయితే అనూహ్యంగా ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. ఇప్పుడు అది కూడా మారిపోయింది. సినిమా విడుదల ఆలస్యం అవుతుందంటూ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ బ్యాలెన్స్ ఉండటంతో సినిమా విడుదల ఆలస్యం అవుతుందని తెలిపారు చిత్ర యూనిట్. పెద్ది సినిమాను జూన్‌లో విడుదల చేస్తాం అని తెలిపారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం అని తెలిపారు మూవీ టీమ్. దాంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ పడుతున్నారు.



# ప్రభాస్ 'ఫౌజీ'లో ఛాన్స్..


## ఆ ఒక్క కారణంతో వదులుకున్న టాలీవుడ్ హీరో.. ఎవరో తెలుసా?

పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆయనతో కలిసి నటించే ఛాన్స్ వస్తే ఎవరైనా ఎగిరి గంతేస్తారు. అయితే ఈ టాలీవుడ్ యంగ్ అండ్ ట్యాలెంటెడ్ హీరో మాత్రం ప్రభాస్ తో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశాన్ని వదులుకున్నాడు. పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న చిత్రం ఫౌజీ. హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో ఇమాన్వీ హీరోయిన్ గా నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవింద్రన్ తదితర స్టార్స్ వివిధ పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్మాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తోంది. యుద్ధం నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథా చిత్రంలో ప్రభాస్ సైనికుడుగా కనిపిస్తారని సమాచారం. అయితే ఈ ఫౌజీ సినిమాలో నటించే అవకాశం వచ్చినా చేయలేకపోయానంటున్నాడు యంగ్ అండ్ ట్యాలెంటెడ్ హీరో తిరువీర్. వైవిధ్యమైన కథలతో సినిమాలు చేస్తోన్న ఈ హీరో ఇప్పుడు పాపం ప్రతాప్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు.

ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా శుక్రవారం (ఏప్రిల్ 16) రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న తిరువీర్ తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఇదే సమయంలో ప్రభాస్‌తో కలిసి నటించే అవకాశం వచ్చినా.. వదిలేశానని చెప్పుకొచ్చాడు. 'హీరోగానే కాకుండా సపోర్టింగ్ యాక్టర్‌గానూ నాకు అవకాశాలు వస్తున్నాయి. కానీ కొన్ని కథలు నచ్చక రిజెక్ట్ చేశాను. మరికొన్ని నచ్చినా.. డేట్స్, లుక్ సెట్ కాక వదులుకోవాల్సి వస్తోంది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'కింగ్‌డమ్'లో మురుగన్ పాత్ర నేనే చేయాల్సింది. కానీ డేట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయాను. అలాగే ప్రభాస్ 'ఫౌజీ'లోనూ ఒక పాత్ర కోసం నన్ను అడిగారు. కానీ నేను వేరే వేరే సినిమాలతో బీజీగా ఉండడం.. ఒక్కో నెలకు ఒక్కో లుక్‌లో ఉండాల్సి రావడంతో అది కూడా వదులుకోవాల్సి వచ్చింది. నా కోసం వాళు షూటింగ్ ఆపుకోవడం నాకు ఇష్టం ఉండదు. వాళ్లకు ప్రయారిటీస్ ఉంటాయి. బడ్జెట్..కండీషన్స్ ..టార్గెట్స్ అన్నీ ఉంటాయి. మన వల్ల అవ్వనప్పుడు మనం ఇబ్బంది పడొద్దు..ఎదుటి వాళ్లను ఇబ్బంది పెట్టొద్దు. అందుకే కొన్ని నచ్చిన పాత్రలను కూడా వదిలేశాను'. 'మన సినిమా ఇండస్ట్రీ చాలా చిన్నది. ఏ హీరో ఏ సినిమా చేస్తున్నాడు అనేది అందరికి తెలుసు. అందుకే డేట్స్ కుదరట్లేదు అంటే అర్థం చేసుకుంటారు. ప్రస్తుతం నేను సపోర్టింగ్ యాక్టర్‌గా ఏ సినిమా చేయట్లేదు. హీరోగా నటించిన రెండు, మూడు సినిమాలు ఈ ఏడాదిలోనే విడుదలయ్యే అవకాశం ఉంది' అని తీరువీర్ చెప్పుకొచ్చాడు.

కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్..

# లక్నోపై విజయంతో టాప్ ప్లేస్ చేరిన ఆర్సీబీ..



డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బుధవారం లక్నో సూపర్‌జెయింట్స్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి, ఈ ఐపీఎల్ సీజన్‌లో తమ నాలుగో విజయాన్ని నమోదు చేసుకుంది. బెంగళూరు తమ సొంత మైదానంలో 15.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. లక్నో 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌లో ఒక్క అర్ధశతకం కూడా నమోదు కాలేదు. విరాట్ కోహ్లీ (49) అత్యధిక పరుగులు చేసి, ఒక్క పరుగు తేడాతో అర్ధశతకాన్ని కోల్పోయాడు. రజత్ పాటిదార్ 27, జితేష్ శర్మ 23 పరుగులు చేశారు.

### విరాట్ కోహ్లీ 'ట్రిపుల్ సెంచరీ'.. హిస్టరీ క్రియేట్ చేయడానికి అడుగు దూరంలో కింగ్..!

ఐపీఎల్ 2026లో ఆర్‌సీబీ వర్సెస్ ఎల్ఎస్‌జీ మ్యాచ్‌లో చరిత్ర సృష్టించడానికి విరాట్ కోహ్లీ సిద్ధంగా ఉన్నాడు. అతను 300 సిక్సర్లు కొట్టే మైలురాయికి చేరువలో ఉన్నాడు. ఈ మైలురాయిని ఇప్పటివరకు క్రిస్ గేల్, రోహిత్ శర్మ మాత్రమే సాధించారు. ఈ మ్యాచ్‌లో అతను రెండు సిక్సర్లు కొడితే, కోహ్లీ ఈ అరుదైన క్లబ్‌లో చేరతాడు. ఇది అతని అభిమానులకు గొప్ప సంబరాల సమయం. ఐపీఎల్ 2026లో 23వ మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్‌జెయింట్స్ మధ్య జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి విరాట్ కోహ్లీపైనే ఉంది. ఈ మ్యాచ్‌లో ఓ భారీ రికార్డు సృష్టించే అవకాశం అతనికి ఉంది. ఇప్పటివరకు క్రిస్ గేల్, రోహిత్ శర్మ మాత్రమే ఈ రికార్డును సాధించారు. లక్నోతో జరిగే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఐపీఎల్‌లో ట్రిపుల్ సెంచరీ సిక్సర్లు కొట్టే మైలురాయిని చేరుకునేందుకు చేరువయ్యాడు. ఇంతకుముందు, ఐపీఎల్‌లో 300 సిక్సర్ల రికార్డును క్రిస్ గేల్, రోహిత్ శర్మ మాత్రమే బ్రేక్ చేశారు. ఇప్పుడు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీకి ఈ అవకాశం లభించింది. విరాట్ కోహ్లీ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 298 సిక్సర్లు సాధించాడు. అతను ఇప్పటివరకు ఆడిన 271 మ్యాచ్‌లలో, 263 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనతను అందుకున్నాడు. ఇప్పుడు, ఈ మ్యాచ్‌లో తన 300 సిక్సర్ల మైలురాయిని



పూర్తి చేసుకునే అవకాశం అతనికి లభించింది. లక్నో సూపర్‌జెయింట్స్‌తో జరిగే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ రెండు సిక్సర్లు కొడితే, అతను ఐపీఎల్‌లో 300 సిక్సర్లు కొట్టిన మూడవ బ్యాట్స్‌మన్‌గా నిలుస్తాడు. అంతేకాకుండా, ఈ ఘనత సాధించిన రోహిత్ తర్వాత రెండవ భారత బ్యాట్స్‌మన్‌గా కూడా నిలుస్తాడు. ఈ జాబితాలో వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 142 ఐపీఎల్ మ్యాచ్‌లలో 141 ఇన్నింగ్స్‌లలో 357 సిక్సర్లు కొట్టాడు. రెండవ స్థానంలో ఉన్న రోహిత్ శర్మ, 276 మ్యాచ్‌లలో 271 ఇన్నింగ్స్‌లలో 310 సిక్సర్లు కొట్టాడు.

# లక్నోకు భారీ షాక్.. సడన్‌గా మైదానం వీడిన పంత్.. మైదానంలో అసలేం జరిగిందంటే?

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరుగుతున్న కీలక పోరులో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ రిషబ్ పంత్ బ్యాటింగ్ చేస్తూ గాయపడటంతో మైదానాన్ని వీడాల్సి వచ్చింది. పంత్ మోచేతికి బలంగా బంతి తగలడంతో నొప్పితో విలవిలలాడాడు. ఈ హఠాత్పరిణామం లక్నో అభిమానులను తీవ్ర ఆందోళనలో పడేసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరుగుతున్న 23వ మ్యాచ్‌లో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇన్నింగ్స్ ఐదో ఓవర్ సమయంలో జోష్ హేజిల్‌వుడ్ వేసిన బంతిని పుల్ షాట్ ఆడేందుకు రిషబ్ పంత్ ప్రయత్నించాడు. అయితే బంతి అనూహ్యమైన వేగంతో వచ్చి నేరుగా పంత్ ఎడమ మోచేతికి బలంగా తగిలింది. ఆ సమయంలో పంత్ తీవ్రమైన అసౌకర్యానికి గురయ్యాడు. ఆ తర్వాతి బంతికే పంత్ బంతిని వికెట్ల మీదకు కొట్టుకోబోయి తృటిలో తప్పించుకున్నాడు. అప్పటికే ఆయన తీవ్రమైన నొప్పితో ఇబ్బంది పడుతున్నట్లు స్పష్టంగా కనిపించింది.

### మైదానంలోకి వైద్య బృందం.. నిష్క్రమణ

పంత్ ఇబ్బందిని గమనించిన అంపైర్లు ఆటను కాసేపు నిలిపివేశాడు. వెంటనే లక్నో ఫిజియో మైదానంలోకి వచ్చి పంత్ ఎడమ చేతికి ప్రాథమిక చికిత్స అందించారు. నొప్పి తగ్గడానికి మ్యాజిక్ స్ప్రే ఉపయోగించినప్పటికీ, పంత్ తన ఎడమ చేతిని కనీసం కదిలించలేకపోయాడు. ఫిజియోతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, రిస్క్ తీసుకోవడం ఇష్టం లేక పంత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాలని నిర్ణయించుకున్నాడు. పంత్ కేవలం 3 బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండానే మైదానాన్ని వీడాడు.



### లక్నో శిబిరంలో ఆందోళన..

ప్రస్తుతం లక్నో స్కోరు 4.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 33 పరుగులుగా ఉంది. మైదానంలో మిచెల్ మార్ష్ 21 పరుగులతో ఆడుతుండగా, నికోలస్ పూరన్ క్రీజులోకి వచ్చాడు. అయితే కీలకమైన సమయంలో పంత్ వంటి విధ్వంసకర బ్యాటర్ గాయపడటం లక్నో విజయావకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పంత్ గాయం తీవ్రత ఎంతవరకు ఉందనేది స్కానింగ్ తర్వాతే తెలిసే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటికే అద్భుత ఫామ్‌లో ఉన్న పంత్ ఇలా అర్ధాంతరంగా తప్పుకోవడం జట్టు సమతూకాన్ని దెబ్బతీసింది.

### బెంగళూరు బౌలర్ల ఆధిపత్యం..

మరోవైపు బెంగళూరు బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లక్నోను ఒత్తిడిలోకి నెట్టారు. ముఖ్యంగా జోష్ హేజిల్‌వుడ్ తన వేగంతో బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నారు. పంత్ నిష్క్రమణ తర్వాత లక్నో ఇన్నింగ్స్‌ను మార్ష్, పూరన్ ఎలా ముందుకు తీసుకెళ్తారో చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com